
ఆంధ్రజ్యోతి



రంపచోడవరంలో అటెన్షన్..

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద టెన్షన్ నెలకొంది. మంగళవారం ఉదయం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన హిడ్మా సహా ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను అక్కడే భద్రపరిచారు. బుధవారం కుటుంబీకులు, బంధువులు రావడంతో పోస్టుమార్టం ప్రక్రియ ప్రారంభించారు. హిడ్మా, ఆయన భార్య రాజే మృతదేహాలకు హిడ్మా సోదరుడు ముయా, రాజే సోదరుడు హెలిన్ సమక్షంలో పోస్టుమార్టం పూర్తిచేశారు. మంగళ, బుధవారం ఎన్‌కౌంటర్లలో మరణించిన మిగిలినవారికి గురువారం పోస్టుమార్టం చేస్తారు.





అడవిలో.. అలజడి

మారేడుమిల్లికే ఎందుకు?

- రెండో రోజూ పేలిన తూటాలు
- టెక్ శంకర్ సహా ఏడుగురు మృతి
- ఆపరేషన్ సంభవ్ సక్సెస్
- కొనసాగుతున్న కూంబింగ్
- రంపచోడవరం ఆసుపత్రికి సీన్
- భారీగా భద్రతా బలగాల పహారా

(రంపచోడవరం/మారేడుమిల్లి)

అడవిలో అలజడి రేగింది. గత రెండు రోజులుగా ప్రశాంతంగా ఉండే మారేడుమిల్లి ఫారెస్ట్‌లో తూటాల శబ్దాలు.. కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాల బూట్ల హడావుడితో తెలియని భయం నెలకొంది. ఇక్కడ వరుసగా జరిగిన రెండు ఎన్‌కౌంటర్లతో రేపు ఏం జరుగుతుందోననే ఆందోళన కలిగిస్తున్నాయి. మావోయిస్టు అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజే సహా మొత్తం ఆరుగురు మంగళవారం నాటి ఎన్‌కౌంటర్లో హతమైన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ ఘటన జరిగి 24 గంటలు దాటక ముందే బుధవారం వేకువజామున జరిగిన మరో ఎన్‌కౌంటర్ హడలెత్తించింది. మొదటి ఎన్‌కౌంటర్ మారేడుమిల్లి మండలంలోని నెల్లూరులో జరగ్గా.. ఆరుగురు మృతి చెందారు.. ఇదే మండలంలోని జీఎం వలస గ్రామంలో రెండో ఎన్‌కౌంటర్ జరగ్గా ఏడుగురు మృతి చెందారు. గత రెండు రోజులుగా వందలాది భద్రతా దళాల రాకపోకలతో రంపచోడవరం-మారేడుమిల్లి ఏజెన్సీ హడావుడిగా మారింది. మృతదేహాలు భద్రపరిచిన రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద భద్రతా దళాలు పహారాగా ఉన్నారు. ప్రతి ఒక్కరి రాకపోకలను నిరంతరం వీరు పర్యవేక్షిస్తున్నారు.ఏరియా ఆసుపత్రికి వచ్చిన మృతుల బంధువులు విడిగా కూర్చొని ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి విషయంలోనూ గోప్యత పాటిస్తున్నట్లుగా ఇక్కడి పరిస్థితి నెలకొంది.

రంపచోడవరం ఏజెన్సీలో దాదాపు రెండు దశాబ్దాల నుంచి నక్సల్స్ జాడలు తగ్గిపోయాయి. ఈ ఏడాది ఏడు నెలల్లో నాలుగు ఎన్‌కౌంటర్లు జరగడంతో పాటు బుధవారం నాటికి 18 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఏడాది వై.రామవరం మండలం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు, జూన్‌లో మారేడుమిల్లి మండలం కింటుకూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు,బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ నుంచి సురక్షిత ప్రాంతమైన మారేడుమిల్లి ఏజెన్సీకి మావోయిస్టులు తరలివస్తున్నారని స్వయంగా జిల్లా ఎస్పీ బర్దర్ వెల్లడించడంతో మళ్లీ మావోయిస్టుల ప్రభావంపై చర్చ జరుగుతోంది. మారేడుమిల్లి ఏజెన్సీలోకి మావోయిస్టులు.. ముఖ్యనేతలు వస్తున్నారంటే ఇప్పటికే ఇక్కడ అనువైన వాతావరణం ఏర్పాటుచేసుకుని ఉండొచ్చనే వాదన వినిపిస్తోంది.దీంతో నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. కూంబింగ్ నిరంతరం సాగేలా భద్రతా దళాలకు ఆదేశాలు అందుతున్నాయి.

గిరిజనుల్లో భయం భయం

అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ల జరిగిన సమీప గ్రామాల్లో 'ఆంధ్రజ్యోతి' బృందం బుధవారం పర్యటించింది. అయితే ఇక్కడ సాధారణ వాతావరణమే నెలకొంది. చాలామందికి ఎన్‌కౌంటర్ తమకు సమీపంలోనే జరిగిందనే సమాచారం కూడా తెలీదు. మారేడుమిల్లి మండల కేంద్రంలోనే అలాంటి వాతావరణం కనిపించలేదు. కానీ మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగిన నెల్లూర్ సమీప నివాసిత ప్రాంతంలోనూ, బుధవారం ఎన్‌కౌంటర్ జరిగిన గుజ్జుమామిడి వలస (జీఎం వలస) పంచాయతీలోనూ ఇదే విషయం చర్చించుకుంటున్నారు. కొండపోడు వ్యవసాయం, కల్లు చెట్టు గీతకు ప్రతిరోజూ వేకువజామునే ఆయా అటవీ మార్గాల్లో సంచరించే గిరిజనులు ఈ ఘటనతో తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు.

సెంట్రల్ జైలుకు 40 మంది

రాజమహేంద్రవరం/కాకినాడ/రావులపాలెం,నవంబరు19 (ఆంధ్రజ్యోతి): పోలీసులు మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని విజయవాడ,ఏలూరు, సామర్లకోట, రావులపాలెంలలో అదుపులోకి తీసుకున్న మావోయిస్టులను రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాలకు కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. ఏలూరులో పట్టుబడిన 10 మంది, విజయవాడలో నలుగురు, రావులపాలెంలో అరెస్టు చేసిన ఒకరిని కలిపి 15మందిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని ఆయా కోర్టులు బుధవారం ఆదేశించాయి. విజయవాడ, ఏలూరు, కాకినాడలో అరెస్టు చేసిన 29 మంది మహిళలను ప్రత్యేక మహిళా కారాగారానికి తరలించాలని ఆదేశించాయి. ఇప్పుడు రిమాండుకు ఇచ్చిన 40 మందిపై ఉపా చట్ట ప్రకారం కూడా కేసులు నమోదు చేశారు. దీంతో వీళ్లను మిగతా ఖైదీలతో కలవకుండా ఉంచాల్సి ఉంటుంది. ఇప్పటికే జైలు 1300 మందితో కిక్కిరిసి ఉండడం, గదుల కొరత ఉండడంతో వీళ్లను ఎక్కడ ఉంచుతారో అనే సందిగ్ధం నెలకొంది.



సామర్లకోట నుంచి ఇద్దరు

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలో పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టులను పోలీసులు బుధవారం సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ నేతృత్వంలో మహిళా ఎస్ఐ, మరికొంత మంది ఎస్కార్ట్ సిబ్బంది మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో కేసు పత్రాల సమర్పించిన అనంతరం జడ్జి షేక్ షరీన్ 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టుల పేర్లు అనూష, అంకితగా చెబుతున్నారు. మహిళా మావోయిస్టుల్లో ఒకరు మాత్రమే న్యాయమూర్తి మాటలకు సమాధానమిచ్చారు.

రావులపాలెంలో హిడ్మా అనుచరుడు



రావులపాలెం,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెంలో మావోయిస్టు హిడ్మా అనుచరుడు సరోజ్ మడివి అలియాస్ ఓండాను పోలీసులు అరెస్టు చేసినట్టు రావులపాలెం సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కృష్ణరాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్గేలంకకు చెందిన సరోజ్ మడివి 12వ ఏట మావోయిస్టుల కార్యకలాపాలకు ఆకర్షితుడయ్యాడు. నిఘా వర్గాల సమాచారంతో మంగళవారం రాత్రి రావులపాలెం గౌతమి వంతెన సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. తుపాకీతోపాటు పది తూటాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

2 ఎన్‌కౌంటర్లు..13 మంది హతం : ఎస్పీ

ఆపరేషన్ సంభవ్ పేరిట ఈ కూంబింగ్ జరిగింది. మొదటి రోజు తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున భద్రతా దళాలకు ఎదురుపడడం, వెంటనే జరిగిన ఎదురుకాల్పుల్లో టెక్ శంకర్ సహా ఏడుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లకు సంబంధించి మొత్తం 13 మంది మావోలు మరణించారు.



తెల్లవారుజామున శబ్దాలు : నారాయణరెడ్డి, జీఎం వలస

తెల్లవారు జామున నాలుగు గంటలకు అటవీ ప్రాంతం నుంచి భారీ శబ్దాలు వినిపించాయి. తొలుత పర్యాటకులెవరో సందడి చేస్తున్నారని భావించాం. వరుస భారీ పేలుళ్ల శబ్దాలతో భయపడ్డాం. కొద్దిసేపటికి పోలీసులు వచ్చి ఎవరు అటవీ ప్రాంతం వైపుగానీ, చేను పాకల వైపు రావొద్దని హెచ్చరించడంతో భయాందోళనకు గురయ్యాం.





అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల చెక్కును రైతులకు అందజేస్తున్న కలెక్టర్, ఎంపీ

రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వాలు

- అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్
- జిల్లాలో 1.34లక్షల మంది రైతులకు రూ.90.59 కోట్ల చెక్కుల విడుదల
- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు హాజరు
- నియోజకవర్గంలో రైతులకు చెక్కులు విడుదల చేసిన ప్రజాప్రతినిధులు

అమలాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయని ఆ దిశగా రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నాయని విశాఖపట్నం పార్లమెంటు సభ్యుడు మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. అమలాపురంలోని ఎర్రవంతెన వద్ద ఉన్న పళ్ల వెంకట్రావు కోకోనట్ సొసైటీకల్యాణ మండపంలో బుధవారం అమలాపురం నియోజకవర్గ రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రెండో విడత నిధులు విడుదల సందర్భంగా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రి నుంచి సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు విడుదల కార్యక్రమం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం ఎంపీ భరత్ మాట్లాడుతూ రెండో విడతలో అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్రం రూ.5వేలు, పీఎం కిసాన్ కింద కేంద్రం రూ.2వేలు చొప్పున అందిస్తోందన్నారు. డీబీటీ విధానంలో రూ.7వేలు ఆర్థికసాయం రైతుల ఖాతాల్లో జమవుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మరో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1.34లక్షల మంది రైతులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రూ.90.59 కోట్లను రైతు ఖాతాల్లోకి జమవుతున్నాయన్నారు. అర్హత కలిగిన ప్రతీ రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20వేల వంతున ప్రభుత్వం అందిస్తుందని, దీన్ని రైతులు సక్రమంగా వ్యవసాయం అవసరాలకు వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ అమలాపురం నియోజకవర్గ పరిధిలో అన్నదాతలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు 13,364 మంది రైతులకు రూ.9.24 కోట్లను అందజేస్తున్నట్టు తెలిపారు. రైతులు తమ పెట్టుబడి సాయం కింద ఈ నిధులను వినియోగించుకుని రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థితికి ఎదగాలని ఆనందరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ కంచిపల్లి అబ్బులు, టీడీపీ నాయకులు దెందుకూరి సత్తిబాబురాజు, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, అరిగెల నానాజీ, కడలి వెంకటేశ్వరరావు, మాకిరెడ్డి పూర్ణిమతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన టీడీపీ నియోజకవర్గ స్థాయి నాయకులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదలకు సంబంధించిన చెక్కును కలెక్టర్ మహేష్‌కుమార్, ఎంపీ భరత్ చేతులమీదుగా ఎమ్మెల్యే ఆనందరావుకు అందజేశారు.

అనధికార భవనాల క్రమబద్ధీకరణకు అవకాశం

అమలాపురంటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన బిల్డింగ్ రెగ్యులైజేషన్ అండ్ పీనలైజేషన్స్ నిబంధనలను అనుసరించి అనధికార భవనాలను క్రమద్ధీకరించుకునేందుకు మరో అవకాశం కల్పించినట్టు అమలాపురం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలెప్మెంట్ డిపార్టుమెంటు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అమలాపురం పట్టణంలో అనధికారికంగా నిర్మించిన భవనాలతోపాటు అనుమతులు పొందిన ప్లాన్‌కు భిన్నంగా నిర్మించిన అన్ని భవనాలను రెగ్యులైజేసషన్ చేసుకునేందుకు చివరి అవకాశం కల్పించారన్నారు. ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీలోపు నిర్మాణం చేసిన అన్ని అనధికార బిల్డింగులను అర్హతగా చేయడం జరుగుతుందన్నారు. 2026 మార్చి 11వ తేదీలోగా ఆయా భవనాల యజమానులు ఆన్‌లైన్‌లో ప్రభుత్వ నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసుకుని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సందేహాలుంటే టౌన్ ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలని కోరారు.

ఉమ్మడి జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో ఇందుపల్లిలో నిర్వహణ

6

డబ్బు కోసమే బాలిక కిడ్నాప్

నిందితుడి అరెస్టు

14 రోజుల రిమాండ్

7

జాహ్నవి మృతదేహం లభ్యం

7

జిల్లాలో 34 పాఠశాలల్లో సామాజిక తనిఖీలు

మధ్యాహ్న భోజన పథకం, ఆర్వో ప్లాంటుల్లో లోపాల గుర్తింపు

అంబాజీపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో ఉన్న 34 ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ సిబ్బంది పరిశీలించి పలు లోపాలను గుర్తించడం జరిగిందని జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మి తెలిపారు. అంబాజీపేట ఎంఆర్సీ భవనంలో సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రాథమిక, జడ్పీ హైస్కూళ్లకు సంబంధించి 34 పాఠశాలల్లో ఉన్న హెచ్ఎం, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీలు సింహాద్రి, పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇటీవల చేపట్టిన సామాజిక తనిఖీ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పలు లోపాలను గుర్తించడం జరిగిందన్నారు. ముఖ్యంగా పాఠశాలలో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి గుడ్లు, రాగిపౌడర్ ఆలస్యంగా రావడం, ఆర్వో ప్లాంట్లు లేక విద్యార్థులకు తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. అలాగే పలు పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని తనిఖీల్లో గుర్తించారన్నారు. అలాగే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్య పుస్తకాలు, విద్యా సామగ్రి కిట్లు, ట్యాబ్‌ల నిర్వహణ వంటి వాటిని పరిశీలించడం జరిగిందన్నారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులపై ఆయా గ్రామాల్లో గ్రామసభలను ఏర్పాటుచేసి గుర్తించడం జరిగిందన్నారు. విద్యామిత్ర కిట్లకు సంబంధించి అన్ని పాఠశాలలో 89,146 మంది విద్యార్థులు ఉండగా, 668 మంది బయోమెట్రిక్ పడడంలేదన్నారు. జిల్లాలో 2,147 స్కూళ్లలో పర్యావరణ క్లబ్ (ఏకోక్లబ్) కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం ఏడీ ఎన్.సురేష్, డీఆర్పీలు పాల్గొన్నారు.



అంబాజీపేట సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మమ్మి



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న రైల్వేలైన్ బాధితులు

రైల్వేలైన్ సర్వేతో మళ్లీ నష్టపోవాలా

కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన బాధిత రైతులు

అమలాపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైల్వేలైన్ కోసం కొత్తగా చేస్తున్న సర్వేతో మళ్లీ తామంతా నష్టపోవాల్సి వస్తుందని బాధిత రైతులు బుధవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అవే పంట భూములపై ఆధారపడి తామంతా జీవిస్తున్నామని తెలిపారు. గతంలో 216 జాతీయ రహదారి ఏర్పాటుకు ప్రభుత్వం అడిగిన వెంటనే అమలాపురం రూరల్ మండల పరిధిలోని రైతులు భూములు ఇవ్వడం జరిగిందన్నారు. జాతీయ రహదారితో పక్కన ఉన్న తమ మిగుల భూముల ధరలు పెరుగుతాయని ఆశించామన్నారు. ఇప్పటికే కొందరు మిగులు భూములను ఆడపిల్లలకు పసుపు కుంకుమ మాన్యం కింద ఇచ్చారన్నారు. ప్రస్తుతం కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ ఏర్పాటుకు ప్రభుత్వం భూసేకరణకోసం సర్వేలు చేస్తోందన్నారు. ఇప్పటికే రైల్వే, రెవెన్యూశాఖ అధికారులు తమను కలిసి ఆయా భూముల్లో ఫలసాయంలో ఉన్న కొబ్బరిచెట్ల వివరాలు, పట్టాదారుపాసు పుస్తకాల నకళ్లు తీసుకోవడం జరిగిందని చెప్పారు. గతంలో చేపట్టిన రైల్వేలైన్ సర్వే వివరాలను పరిశీలించి ప్రస్తుతం తమకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి న్యాయం చేయాలని వేడుకున్నారు. వినతిపత్రం అందించినవారిలో రేకపల్లి సోము, రంకిరెడ్డి సూర్యనారాయణ, పి.శ్రీనివాసరావు, పి.మురళీ, దాట్ల సత్యనారాయణరాజు, సైదుల సత్యనారాయణ, గుబ్బల వెంకటేశ్వరరావు ఉన్నారు.


విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న సురేఖ (ఎరుపు జెర్సీ)

ఆదివాసీ బిడ్డ కుస్తీ మే సవాల్ అంటోంది. బరిలో ఎవరున్నా పతకం నాదే అంటోంది. గిరిజన గూడెంలో పుట్టి న ఈమె కుస్తీ పోటీల్లో ఎదుటివారిని మట్టికరిపిస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సత్తాచాటి జాతీయ స్థాయిలోనూ పతకం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తోంది.


స్వర్ణ పతకంతో సురేఖ

కుస్తీ మే సవాల్

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

అల్లూరి జిల్లా చింతూరు మండలం అల్లిగూడేనికి చెందిన మడకం సురేఖ వరరామచంద్రపురం మండలం సోములగూడెం ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈమెకు ఫిజికల్ డైరెక్టర్ పూరి శివ కొద్ది నెలలుగా కుస్తీ పోటీలకు శిక్షణ ఇస్తున్నారు. అక్టోబరు 4న కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 పోటీల్లో పాల్గొన్న సురేఖ మొత్తం 60 మందిలో సత్తా చాటి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లోనూ ఆమె ప్రతిభ కనబరిచింది. 52 మంది పాల్గొనగా విజేతగా నిలిచి మరో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. వచ్చే ఏడాది జనవరి మొదటివారంలో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైంది. బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా సోములగూడెం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పండా సునీత, డిప్యూటీ వార్డెన్ మడకం భద్రమ్మ, ఉపాధ్యాయులు సురేఖను ఘనంగా సన్మానించారు.

సురేఖ తల్లిదండ్రులు ఆనంద్, ఊర్వశి. వీరిది అతి పేద కుటుంబం. చిన్నపాటి వ్యవసాయమే జీవనాధారం. పొద్దంతా పొలం పనులు చేసుకోవడం, అటవీ ఉత్పత్తులు సేకరించి అమ్మగా వచ్చిన సొమ్ములతో కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు.

- సత్తా చాటుతున్న సురేఖ
- రాష్ట్ర స్థాయిలో స్వర్ణ పతకం కైవసం
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక
- అల్లిగూడెం నుంచి న్యూఢిల్లీకి ఆదివాసీ బిడ్డ క్రీడా ప్రస్థానం



బిర్సా ముండా జయంతి సందర్భంగా సురేఖను సన్మానించిన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు


జాతీయ స్థాయి పోటీకి సాధన చేస్తున్న సురేఖ (నీలం రంగు షర్టు)



నేను సాధించలేనిది నా కూతురు సాధించింది

సురేఖ తండ్రి ఆనంద్



నాకు క్రీడలంటే ప్రాణం. చింతూరులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో 9వ తరగతి చదివినప్పుడు జిల్లా స్థాయిలో 800 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని విజయం సాధించాను. ఆపై అనారోగ్యంతో చదువుతో పాటు క్రీడా రంగానికి కూడా దూరమయ్యాను. ఇపుడు నా కూతురు రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతుండడం.. ఆమెకు పీడీ, ఉపాధ్యాయులు సహకరించడం ఎంతో సంతోషంగా ఉంది. నేను సాధించలేనిది నా కూతురు సాధిస్తుంటే పట్టలేనంత ఆనందంగా ఉంది.

ఉపాధ్యాయుల తోడ్పాటుతోనే సాధ్యమైంది: సురేఖ

పాఠశాల ఉపాధ్యాయులు నా ప్రతిభను గుర్తించి కుస్తీలో శిక్షణ ఇస్తున్నారు. వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించాను. ఉపాధ్యాయులే స్వయంగా సన్మానించడం నాకెంతో గర్వంగా ఉంది. నాలో పట్టుదలను మరింత పెంచింది.

జాతీయ స్థాయిలో పతకమే లక్ష్యం

పూరి శివ, సోములగూడెం ఆశ్రమ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్



సురేఖపై నాకు నమ్మకం ఉంది. ఆమె ప్రదర్శనే ఇందుకు నిదర్శనం. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధనకు శక్తి వంచన లేకుండా కష్టపడుతున్నాం. తద్వారా రాష్ట్రంలో గుర్తింపు పొందడంతో పాటు ఆదివాసీ బిడ్డ మరింత ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది.

బిడ్డకి మిఠాయిలు ఇచ్చి వచ్చాము

సురేఖ తల్లి ఊర్వశి



సోములగూడెం వెళ్లి మా బిడ్డను చూసి వచ్చాము. మిఠాయిలు కొనిచ్చి వచ్చాము. ధైర్యం చెప్పాము. పీడీ, ఉపాధ్యాయులు సురేఖను సొంత బిడ్డలా చూసుకుంటున్నారు. జాతీయ స్థాయిలో గెలవాలని మొక్కుకుంటున్నా.


పోటీలను ప్రారంభిస్తున్న కోనసీమ జిల్లా డీఈవో సలీంబాషా

ఇందుపల్లిలో ఉమ్మడి జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం లంక రాణి ఆధ్వర్యంలో జరిగిన పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ప్రార ంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు ప్రభుత్వం ప్రత్యేక క్రీడా కోటాను అమలుచేస్తుందన్నారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తూ ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలని సూచించారు. బాలుర, బాలికల విభాగంలో వేర్వేరుగా నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కంకిపాటి వెంకటేశ్వరరావు, మట్టపర్తి వెంకటసముద్రం, జి.గణేష్‌బాబు, యనమదల శ్రీనివాసరావు, షేక్ వలీసాహెబ్ వ్యవహరించారు. సాయంత్రం వరకు జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించిన పవర్ లిఫ్టర్లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు తెలిపారు.

విజేతలు వీరే..

ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి. 53 కిలోల విభాగంలో సీహెచ్ సత్యగోపాల్ (ఇందుపల్లి), 59 కిలోల విభాగంలో డి.అనిల్ (భీమనపల్లి), 66 కిలోల విభాగంలో ఎంఎస్వీ అవినాష్ (సాకుర్రు), 74 కిలోల విభాగంలో జి.దినేష్‌ప్రసాద్ (ముక్కామల), 83 కిలోల విభాగంలో ఎం.దుర్గారామగణేష్ (అమలాపురం), 93 కిలోల విభాగంలో వై.యశ్వంత్‌సుజిత్‌కుమార్ (ముక్కామల), 105 కిలోల విభాగంలో ఎస్కేఎస్ఎస్ మణికంఠ (శానపల్లిలంక) విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో 43 కిలోల విభాగంలో కె.లక్ష్మీకీర్తన భీమనపల్లి, 47 కిలోల విభాగంలో టి.కీర్తి (రాజోలు), 52 కిలోల విభాగంలో కె.శిరీష (ఇందుపల్లి), 57 కిలోల విభాగంలో యు.షానిక (రాజోలు), 63 కిలోల విభాగంలో పి.స్పందన (రాజోలు), 69 కిలోల విభాగంలో ఎం.సంకీర్తనాదేవి (పాలమూరు), 76 కిలోల విభాగంలో వై.ఇందిర (గొల్లవిల్లి), 84కిలోల విభాగంలో వి.మేఘనశ్రీ (భీమనపల్లి) విజేతలుగా నిలిచారు. వీరికి డీఈవోతో పాటు జిల్లా అధికారి డాక్టర్ ఎంఏకే భీమారావు, గుబ్బల పెద్దిరాజు, కామన మధు పతకాలు అందజేశారు.

వర్క్‌షాప్‌లతో ఆవిష్కరణలపై ఆసక్తి

జేఎన్టీయూకే, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్క్‌షాప్‌లలో పాల్గొనడం ద్వారా అధ్యాపకులు, విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యం, ఆవిష్కరణలపై ఆసక్తి పెరుగుతుందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. జేఎన్టీయూలోని ఈసీఈ గ్యాలరీలో బుధవారం ట్రాన్స్‌ఫార్మింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ రీసెర్చ్ విత్ ఐఈఈఈ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. వీసీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ప్రొఫెసర్ శ్రీనివాసకుమార్, అధ్యాపకులు ఉన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద్

కొక్కొరోకో సినిమా సందడి

● తూర్పుపాలెంలో పలు సన్నివేశాలు చిత్రీకరణ

మలికిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండల పరిధిలోని తూర్పుపాలెంలో కొక్కొరోకో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. బుధవారం సంక్రాంతి పండుగకు సం బంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా తూర్పుపాలెంలోని మండువా లోగిళ్లను రంగవల్లులు, పూలదండలు, అరటిచెట్లతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. పౌరాణిక వేషధారణలతో నటీనటులు వీధుల్లో సందడి చేశారు. గ్రామీణ ప్రాంత వాతావరణ నేపథ్యంలో సినిమాను చిత్రీకరిస్తున్నట్టు సినిమా నిర్వాహకుడు రమేష్ వర్మ తెలిపారు. ఆర్వీ ఫిల్మ్ హౌస్ నీలాద్రి ప్రొడక్షన్స్ సమర్పణలో చిత్రీకరణ జరుగుతోందన్నారు. శ్రీనివాస్ వసంతాల దర్శకుడిగా రేఖావర్మ, శిరీష కొర్రపాటి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. నటీనటులుగా సముద్రఖని, సునీల్, మురళీకృష్ణ, సప్తగిరి పమ్మిసాయి, ప్రవీణ్, ప్రియాంక, గోపిక ఉదయం, ప్రతీ నేహ ఉన్నారు. ఎడిటర్‌గా ప్రవీణ్ పూడి, కెమెరామెన్‌గా ఆకాశ్ ఉండగా సంగీతాన్ని కృష్ణప్రసాద్ పనిచేస్తున్నారు.


ఓ సన్నివేశాన్ని తెరకెక్కిస్తున్న దృశ్యం

గోవా ఫిలిం ఫెస్టివల్ జ్యూరీ సభ్యుడిగా 'నామాన' నియామకం

కరప, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోవాలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవ వేడుక (ఐఎఫ్ఎఫ్ఐ-2025) జరగనుంది. ఇందులో భాగంగా నిర్వహించే హాకథాన్/ఏఐ ఫిలిం ఫెస్టివల్ విభాగానికి జ్యూరీ సభ్యుడిగా కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన దర్శక, నిర్మాత నామాన రామదాసునాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. నాలుగు దశాబ్దాలుగా సినీ, టీవీ రంగాల్లో దర్శక, నిర్మాతగా రాణిస్తున్న రామదాసునాయుడు ఆంధ్రప్రదేశ్ నంది అవార్డుల జ్యూరీ మెంబర్‌గా, ఇంటర్నేషనల్ చిల్డ్రన్ ఫిలిం ఫెస్టివల్ కమిటీ మెంబరుగా, ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సేవలందించారు. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర ప్రభుత్వం నుంచి 10 నంది అవార్డులు అందు కున్నారు. రామదాసునాయుడు సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం తాజాగా ఐఎఫ్ఎఫ్ఐ-2025 ఏఐ ఫిలిం సెక్షన్‌కు జ్యూరీ మెంబరుగా నియమించింది. ఆయనకు గ్రామస్థులు, అభిమానులు, పలువురు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు అభినందనలు తెలిపారు.


రామదాసునాయుడు

22న నన్నయలో జాతీయ సెమినార్

దివాన్‌చెరువు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నైపుణ్యాభివృద్ధి కేంద్రం, భౌతికశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో ఇటీవల పరిణామాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు అనే అంశంపై సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో సెమినార్ జరుగుతుందన్నారు. కార్యక్రమం కన్వీనర్‌గా బి.జగన్మోహన రెడ్డి, కో-కన్వీనర్‌గా ఎస్.రాజ్యలక్ష్మి వ్యవహరిస్తారన్నారు. అధ్యాపకులు, పరిశోధకులు ఈసెమినార్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ, వర్సిటీ అధికారులు

కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధులకు ప్రత్యేక ఓపీ సేవలు

23న ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో 65 ఏళ్లు పైబడిన వృద్ధుల సౌలభ్యం కోసం ప్రతి ఆదివారం ప్రత్యేక ఓపీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన వైద్యసేవలు ఈనెల 23న ప్రారంభం కానున్నాయి. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ చొరవతో జీజీహెచ్‌లో పనిచేసిన మెడిసిన్ విభాగ నిష్ణాతులు డాక్టర్ ఎంబీఆర్ శర్మ, డాక్టర్ కేఎస్ఆర్ స్వామి, డాక్టర్ సీఎస్ఎస్ శర్మ, డాక్టర్ రమణ్‌రావుతో కలిసి జీజీహెచ్ వైద్యులు షిఫ్టుల విధానంలో సేవలు అందించనున్నారు. ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ నడుస్తుందని సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి తెలిపారు.

కాకినాడ జీజీహెచ్‌లో హృద్రోగ వ్యాధులకు రేపు స్క్రీనింగ్ పరీక్షలు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 21వ తేదీన 18 ఏళ్లలోపు వయసు గల పిల్లలకు గుండె వ్యాధికి సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా విజయవాడ ఇండో బ్రిటీష్ హాస్పిటల్ సౌజన్యంతో జీజీహెచ్‌లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఎవరికైనా గుండె వ్యాధి ఉందని నిర్ధారణ అయితే వెంటనే ఇండో బ్రిటీష్ హాస్పిటల్ వైద్యులు వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి. అరుణ పర్యవేక్షిస్తారని డీఎంహెచ్‌వో చెప్పారు.

కేంద్ర మంత్రి సతీమణి పూజలు


చిత్రపటం అందజేస్తున్న ఈవో నీలకంఠం

సామర్లకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రసహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సతీమణి వెంకటేశ్వరీదేవి, ఆమె కుటుంబ సభ్యులు బుధవారం కాకినాడ జిల్లా సామర్లకోటలోని భీమేశ్వరస్వామి ఆలయానికి విచ్చేశారు. వారికి ఈవో బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు), వేదపండితులు సాదర స్వాగతం పలికారు. భీమేశ్వర స్వామికి అభిషేకం, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చనలు జరిపారు.

వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధికి కృషి

● విశాఖ ఎంపీ శ్రీభరత్

ఆత్రేయపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని విశాఖపట్నం ఎంపీ ఎం. శ్రీభరత్ పేర్కొన్నారు. బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. తొలుతగా అర్చక బృందం వేదమంత్రాలతో ఘనస్వాగతం పలికింది. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఎంతో మహిమాన్వితుడైన స్వామి వారు దేశవ్యాప్తంగా ఖ్యాతిని అర్జించారని ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తుందన్నారు. స్వామివారి అభివృద్ధిలో తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయ వద్ద రూ.1.16 కోట్లతో నిర్మిస్తున్న టెన్సిల్ షెడ్ నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. కేంద్రప్రభుత్వం ప్రసాదం స్కీమ్ రూ.96 కోట్ల నిధుల విడుదలకు తనవంతు కృషిచేస్తానని ఎంపీ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలో వాడపల్లి ఆ స్థాయిలో అభివృద్ధి సాధించడం తథ్యమన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వా మినాయుడు, దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఆకుల రామకృష్ణ, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆలయాన్ని సందర్శిస్తున్న ఎంపీ భరత్, ఎమ్మెల్యే బండారు, తదితరులు

హుండీ ఆదాయం రూ.1.59 కోట్లు

ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. పర్యవేక్షణాధికారులు వి.సత్యనారాయణ, జె.రామలింగేశ్వరరావు, వైవీవీ సత్యనారాయణల పర్యవేక్షణలో జరిగింది. మొత్తం 27 రోజులకు గాను రూ.1,30,38,579, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.29,06,170 వెరసి రూ.1,59,44,749 లభించింది. అలాగే బంగారం 15 గ్రాములు, వెండి 910 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ నోట్లు హుండి ద్వారా లభించించిన్నట్టు ఆలయ ఉపకమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ లెక్కింపులో అర్చకులు, గ్రామస్థులు, సిబ్బంది, బ్యాంకు,పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపులో చేతివాటం

ఆలయ సన్నిధిలో బుధవారం నిర్వహించిన స్వామివారి హుండీ లెక్కింపులో ఓ సేవకుడు స్వామివారి నగదు తస్కరించాడు. వివిధ ప్రాంతాల నుంచి సేవకులు వస్తుంటారు. కానుకలు లెక్కిస్తున్న సమయంలో ద్రాక్షారామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాసరావు అనే సేవకుడు రూ.60 వేల నగదు దొంగలిస్తుండగా ఆలయ సెక్యూరిటీ గార్డు పట్టుకుని దేవస్థానం అధికారులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

మత్స్యకారుల వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం అండ : మంత్రి దుర్గేష్

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో మత్స్య రైతులు, మత్స్యకారులను సహకార సంఘాల నుంచి సమృద్ధి వైపు నడిపించేందుకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కోరుమామిడి దివడ్డీస్ ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీకి రూ. 2.54 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వంద మంది కన్నా ఎక్కువ ఉన్న మత్స్యకార సొసైటీలకు సంఘ కార్యకలాపాల కోసం సంవత్సరానికి రూ. 2.5 లక్షలు ఇస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో ఈ సొసైటీకి ఖర్చుల నిమిత్తం నిధులు రావడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇదే ప్రథమమని ఆయన తెలిపారు. ఈ నిధుల ద్వారా కార్యాలయ నిర్మాణానికి, ఫర్నిచర్ ఏర్పాటుకు, మేనేజ్మెంటు చేసే సిబ్బంది వేతనానికి వినియోగించుకోవచ్చన్నారు. ప్రతి మత్స్యకారుడు నేషనల్ ఫిషరీ డెవలప్మెంట్ ప్లాట్‌ఫామ్‌లో రిజిస్టర్ అయివుండాలని, అలా అయివున్నవారికి వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ గ్యారంటీ సదుపాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో కోరుమామిడి మత్స్యకార సంఘాల ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


నిడదవోలులో పీఎం మత్స్య సంపద యోజన చెక్కును అందిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారుడితో ఉపాధ్యాయులు

సామర్లకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో ఈనెల 22వ తేదీ నుంచి 24 వరకు జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.వెంకట శ్రీరామ్ ఎంపికయ్యాడని ఆ పాఠశాల హెచ్‌ఎం కె.ప్రసన్న, వ్యాయామ టీచర్ బి.శివ తెలిపారు. బుధవారం వీరిద్దరు మాట్లాడుతూ అలాగే అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు కూడా ఎంపికైనట్టు హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. అండర్-14 కబడ్డీ బాలుర విభాగంలో కె.అభిరామ్, ఖోఖో బాలికల విభాగంలో జి.వర్షిణి, బాలుర విభాగంలో డి.గౌతమ్‌కుమార్ ఎంపికయ్యారు.

సత్యదేవా.. సంఖ్య తగ్గే!

- గతేడాది కార్తీకం కంటే ఈ ఏడాది తగ్గనున్న సత్యదేవుడి వ్రతాలు
- మొంథా తుఫాన్ ప్రభావంతో సుమారు 10 వేల వ్రతాల్లో కోత
- నేటితో ముగియనున్న కార్తీకమాసం

అన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో ఏటా కార్తీమాసంలో అధికసంఖ్యలో వ్రతాలు జరుగుతుంటాయి. అయితే ఈసారి మాత్రం ఆ సంఖ్య భారీగా తగ్గనుంది. తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి కార్తీకమాసంలో సత్యదేవుడి వ్రతాలు ఆచరిస్తారు. ఏడాదిలో జరిగే వ్రతాల్లో సుమారు 20 శాతం కార్తీకమాసంలో జరుగుతుండడం విశేషం. గతేడాది కార్తీకమాసంలో 1,45,732 వ్రతాలు జరగగా ఈ ఏడాది 1.50 లక్షలు జరుగుతాయని అధికారులు అంచనా వేశారు. గురువారంతో కార్తీకమాసం ముగియనుండగా బుధవారంతో 133644 వ్రతాలు జరగగా గతేడాది కంటే 12088 వ్రతాల లోటులో ఉంది. గురువారం అమావాస్య కారణంగా కేవలం 2వేల వ్రతాలు జరి గే అవకాశాలు ఉన్నాయి. మొత్తంమీద గతేడాది కంటే సుమారు 10 వేల వ్రతాల లోటు కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం కార్తీకమాసం ప్రారంభంలో మొంథా తుఫాన్ ప్రభా వం పడింది. ఈ తుఫాన్ భయంకరంగా ఉంటుందని, కాకినాడ ప్రాంతంలో తీరం దాటుతుందని హెచ్చరికల నేపథ్యంలో భక్తులు వెనకడుగు వేశారు. ఆ సమయంలో భక్తులు పూర్తిస్థాయిలో వచ్చి ఉంటే 1.50 లక్షలు వ్రతాలు జరిగి గతేడాది రికార్డును అధిగమించే అవకాశం ఉండేది. కానీ అలా జరగకుండా వ్రతాల సంఖ్య తగ్గింది.


వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు (ఫైల్)

అడవి నుంచి జనావాసాల్లోకి..

- 'ఆపరేషన్ కగార్' ధాటికి 'తూర్పు' వైపునకు చేరిన మావోలు
- గతేడాది జూన్‌లో గుడిసె పరిసరాల్లో రహస్య సమావేశం
- అప్పటి నుంచి వారి కదలికలపై కేంద్ర బలగాల ప్రత్యేక నిఘా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టు పార్టీ కకావికలం అయిపోయింది. చివరి మావోయిస్టును కూడా హతం చేసి ఆ పార్టీని తుదముట్టించాలని కేంద్రం గట్టిగానే నిర్ణయం తీసుకొంది. దీంతో ఆక్టోపస్, గ్రేహౌండ్స్ సీఆర్పీఎఫ్.. ఇలా అత్యంత చురుకుదనం కలిగిన నిఘా వర్గాలను రంగంలోకి దింపింది. వాళ్లకు అధునాతన ఆయుధ సంపత్తిని అందజేసింది. ఛత్తీస్‌ఘడ్ అడవుల్లోని గిరిజన గ్రామాలను, వ్యక్తులకు జియో ట్యాగింగ్ చేశారంటే ఏ స్థాయిలో మావోయిస్టులను చుట్టుముట్టారో అర్థం చేసుకోవచ్చు. ఆపరేషన్ కగార్‌ను డిసెంబరు చివరి నాటికి ముగించాలని కేంద్రం ఆదేశించింది. అడిషనల్ డీజీ మహేశ్ చంద్ర లడ్డా నేతృత్వంలో అనుకున్న పనిని పది రోజులకు ముందే కానిచ్చేశారు. ఆపరేషన్ కగార్ ధాటికి అన్నలు అడవిని వీడి జనారణ్యంలోకి వచ్చేశారు. ఈ నేపథ్యంలోనే ఏలూరు, విజయవాడ, రావులపాలెం, సామర్లకోట తదితర ప్రాంతాల్లో కొందరు పోలీసులకు చిక్కినట్టు సమాచారం. దీంతో సరిహద్దులో ఎవరున్నారు? జనంలో ఎవరు కలిసి తిరుగుతున్నారు? ఎప్పుడు ఏం జరుగుతుందనే ప్రతిష్ఠంభన రాజ్యమేలుతోంది. నక్సల్‌బరీ ఉద్యమం తొలి



నాళ్లలో ఉమ్మడి తూర్పుగోదావరిలోని మారేడుమిల్లి, రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల్లో పోరుబాట ఉధృతంగా ఉండేది. రాత్రివేళల్లో సంచరించడానికి కూడా పరిస్థితులు భయపెట్టేవి. ఆ తర్వాత ఏపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం, చర్చలు విఫలం కావడం వంటి పరిణామాలతో మావోలు ఏవోబీ వైపునకు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణలకు తరలిపోయారు.

● ఇదే జరిగిందా?

ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో నక్సలైట్ల ఏరివేతలను ఉధృతం చేశారు. దీంతో వాళ్లు మళ్లీ ఆంధ్రానే షెల్టర్ జోన్‌గా ఎంచుకున్నారు. హిడ్మా కూడా ఓ వైపు లొంగిపోతానని సంకేతాలు పంపుతూనే తన పని తాను చేసుకుపోతున్నాడు. కొద్దినెలలక్రితం త్వరలోనే తాను లొంగిపోతాన ని, మధ్యవర్తిత్వం సాగించాలని ఓ విలేకరికి వర్తమానం పంపినట్లు చెప్తున్నారు. ఈ క్రమం లోనే గత జూన్, జూలై నెలల్లో మారేడుమిల్లి సమీపంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుడిసెకు దగ్గరలోని అడవుల్లో మావోయిస్టుల కీలక సమావేశం జరిగింది. ఆ నెలల్లో గుడిసెలో నిర్వహణ, రోడ్ల మరమ్మతుల నిమిత్తం పర్యాటకులను ఆపేశారు. అదే అదనుగా అక్కడ బస చేసి మావోయిస్టులు సమావేశాలు నిర్వహించారు. వాళ్లు వెనుదిరిగిన వారం రోజుల తర్వాత పోలీసులకు ఈ విషయం తెలిసింది. దీంతో రంగంలోకి దిగి ఆరా తీశారు. మావోయిస్టులకు ఆహారం, ఇతర వస్తువులు సరఫరా చేసిన వాళ్లపై కేసులు పెట్టారు. వాటిని పోలీసులు బయటకు రానివ్వలేదని తెలిసింది. దీన్ని వ్యూహంలో భాగం చేశారు. ఆపరేషన్ కగార్‌లో టాప్ లీడర్లపైనే దృష్టిసారించారు. వాళ్లను అంతమొందిస్తూ వస్తున్నారు. జూన్, జూలై నెలల్లో వందల సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల చేతుల్లో చనిపోయారు. టాప్ లీడర్లు కలుగులోంచి బయటకు వస్తున్నారని గుడిసె సమావేశం తర్వాత పోలీసులు అంచనాకు వచ్చారు. ఈ క్రమంలో కాకినాడ పోర్టు నుంచి శ్రీలంకకు మాడ్వి హిడ్మా, అతడి భార్య, మరో ముగ్గురు నలుగురు ముఖ్యులు వెళ్లే ప్లాన్ వేశారు. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో కొంతకాలంపాటు చడీచప్పుడు లేకుండా ఉండాలని వారు భావించి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఈనేపథ్యంలో హిడ్మా, అతడి భార్య, పదుల సంఖ్యలో వివిధ క్యాడర్లలోని మావోయిస్టులు విభజిత తూర్పు, కాకినాడ జిల్లాలకు పయనమయ్యారని తెలుస్తోంది. ఈ పయనంలో వాళ్లు ఉండగా.. అప్పటికే పక్కా సమాచారంతో ఉన్న కేంద్ర బలగాలు మాటువేసి వారిని ఎన్‌కౌంటర్ జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. మంగళవారం ఆరుగురు, బుధవారం ఏడుగురు మరణించగా.. మరో నలుగురు మావోయిస్టులు పోలీసుల చెరలో ఉన్నారని, వారిని హతమార్చడమా? అరెస్టు చూపించడమా? అనే సందిగ్ధంలో పోలీసులు ఉన్నారని తెలుస్తోంది.


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో చింతూరు పోలీసులు

తవుడు కింద గంజాయి బస్తాలు

- పట్టుకున్న చింతూరు పోలీసులు
- రూ.6 లక్షల విలువైన 120 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు బుధవారం 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రమేష్ కథనం మేరకు... ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా ఎంవీ 71 గ్రామానికి చెందిన బిశ్వజిత్ మండల్, సుధీప్ హల్దార్ 120 కిలోల గంజాయిని ఏపీలోకి తరలించేయత్నం చేశారు. బొలేరా వాహనంలో తవుడు లోడు వేసుకుని ఆ లోడు కింద భాగంలో ఎవరికీ అనుమానం కలగకుండా గంజాయి బస్తాలను పేర్చారు. కాగా ఒడిస్సా జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.6 లక్షల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోపై
వైద్యుల ఫిర్యాదులు

- డిసెంబరు 4న విచారణ

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.పుల్లయ్యపై పలువురు వైద్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డిసెంబరు 4న విచారణకు హాజరుకావాల్సిందిగా ఇరుపక్షాలకు ఆదేశాలు అందాయి. విచారణ చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో జరగనుంది. చింతూరు డివిజనులోని కూనవరం, కూటూరు, తులసిపాకల, రేఖపల్లి, జీడిగుప్ప ప్రాథమిక వైద్యశాలల వైద్యాధికారులకు.. పుల్లయ్యకు నడుమ దాదాపు ఏడాదిగా పొసగడం లేదు. దీనిపై ఎవరి వాదన వారిదిగా ఉంది. తాజాగా ఎటపాక మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక వైద్యశాల అధికారి, పుల్లయ్యకు నడుమ కూడా వివాదం రాజుకుంది. దీంతో లక్ష్మీపురం వైద్యాధికారి ఏకంగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి పుల్లయ్యపై పలు ఆరోపణలు చేసిన విషయం విధితమే. ఇదిలా ఉండగా కూటూరు, కూనవరం, రేఖపల్లి, తులసిపాకల, జీడీగుప్ప వైద్యులు డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ జాయింట్ డైరక్టర్ (డీపీహెచ్‌ఎఫ్ డబ్ల్యు)కు పుల్లయ్యపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికార దుర్వినియోగం, వేధింపులు, బెదిరింపులు, మానసిక హింస, ప్రాథమిక సేవా హక్కులతో కూడిన, గౌరవాన్ని తిరస్కరించడం ప్రైవేటు ప్రయోజనాలకు ప్రభుత్వ సేవలను మళ్లించడం, ఆర్థిక దుష్ప్రవర్తన, ప్రతీకారం తదితర చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు డీపీహెచ్‌ఎఫ్‌డబ్ల్యు స్పందించి విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ అండ్ విజువల్ ఇంపెయిర్‌మెంట్ (ఎన్‌పీసీబీబిఐ) జాయింట్ డైరక్టర్ సునీల్‌కుమార్ నాయక్‌ను నియమించారు. ఆ మేరకు డిసెంబరు 4న విచారణ అధికారి చింతూరు రానున్నారు. విచారణ తదుపరి ఎటువంటి పరిణామాలు చర్యలు తీసుకుంటారో చూడాల్సింది ఉంది.

కుండలేశ్వరస్వామి దర్శనానికి వచ్చి
గుండెపోటుతో భక్తురాలు మృతి

కాట్రేనికోన, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరస్వామిని దర్శనానికి ఒక భక్తురాలు విశాఖ నుంచి బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కుండలేశ్వరం వచ్చింది. స్వామిని దర్శించి అన్న ప్రసాదాన్ని స్వీకరించింది. ఆలయం బయట కూర్చుని విశ్రాంతి తీసుకుంటూ గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన కుండలేశ్వర క్షేత్రంలో విషాదం నింపింది. వివరాల ప్రకారం.. విశాఖకు చెందిన బొట్టా నిర్మల (67) బుధవారం కుండలేశ్వరం వచ్చి గోదావరిలో స్నానమాచరించి ఎంతో భక్తితో స్వామిని ఆరాధించింది. అన్న ప్రసాదం తీసుకున్న తర్వాత ఆలయం వద్ద బయట కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు కూర్చుంది. అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలింది. అక్కడ ఉన్న భక్తులు, ఆలయ సిబ్బంది తక్షణం స్పందించినా ఫలితం లేకపోయింది. పవిత్ర కుండలేశ్వర స్వామి సన్నిధిలో తనువు చాలించిన నిర్మల అదృష్టానికి ఆనంద పడాలో, దైవదర్శనానికి వచ్చి మృత్యువాత పడినందుకు విచారించాలో తెలియని అయోమయ పరిస్థితిలో తోటి భక్తులు సతమతమయ్యారు.


వివరాలు వెల్లడిస్తున్న అమలాపురం సీఐ

డబ్బు కోసమే బాలిక కిడ్నాప్

- నిందితుడి అరెస్టు
- 14 రోజుల రిమాండ్
- వెల్లడించిన అమలాపురం సీఐ వీరబాబు

అమలాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఇటీవల సంచలనం కలిగించిన బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు అమలాపురం సీఐ పి.వీరబాబు వెల్లడించారు. డబ్బు కోసమే బాలికను కిడ్నాప్ చేశాడని, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరుచగా 14 రోజుల రిమాండ్ విధించారని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు సీఐ వీరబాబు బుధవారం విలేకర్లకు వివరించారు. ఈనెల 10న అమలాపురంలో స్కూలు నుంచి వస్తున్న పదేళ్ల బాలికను వరుసకు మామయ్య అయిన మట్టపర్తి దుర్గానాగసత్యమూర్తి (చంటి) మోటారు సైకిల్‌పై వచ్చి కిడ్నాప్ చేసి కాకినాడ తీసుకెళ్లాడు. బాలికను క్షేమంగా అప్పగించాలంటే తాను పంపిస్తున్న యూపీఐ క్యూఆర్ కోడ్‌కు డబ్బులు పంపించాలని బాలిక తల్లిదండ్రులను బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. అయితే బాలిక తండ్రి కముజు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అమ లాపురం పట్టణ పోలీసులు డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పర్యవేక్షణలో విచారణ కోసం బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్ఐలు టి.శ్రీనివాస్, జోషి మూడు బృందాలుగా ఏర్పడి కాకినాడ, పి.గన్నవరం, ముంగండ, పోతవరం, కారుపల్లి గ్రామాల్లో ముమ్మరంగా గాలించారు. కిడ్నాప్ అయిన 11 గంటల్లోనే బాలిక ఆచూకీని గుర్తించి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మట్టపర్తి దుర్గానాగసత్యమూర్తి అలియాస్ చంటిని పోతవరం గ్రామంలో బుధవారం సీఐ వీరబాబు పర్యవేక్షణలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది అరెస్టు చేశారు. అతడి నుంచి నేరానికి ఉపయోగించిన మోటారు సైకిల్, 2 సెల్‌ఫోన్లు, బాలిక స్కూలు బ్యాగు, లంచ్‌బాక్సు, జత స్కూలు షూలు స్వాధీన పరచుకున్నారు. అతడిని అమలాపురంలో అడిషనల్ జ్యూడిషీయల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసును చేధించడంలో కృషి చేసిన ఎస్ఐలు, సిబ్బందిని సీఐ వీరబాబు అభినందించారు.

జాహ్నవి మృతదేహం లభ్యం


జాహ్నవి మృతదేహం

మలికిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దిండి-చించినాడ వద్ద గోదావరిలో తండ్రి ఇద్దరు పిల్లలను తోసి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సంఘటనలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లక్కవరం గ్రామానికి చెందిన తండ్రి శిరిగినీడి దుర్గాప్రసాద్, కుమారుడు మోహిత్ మృతదేహాలు మంగళవారం లభ్యం కాగా బుధవారం ఉదయం కుమార్తె జాహ్నవి మృతదేహం లభ్యమైంది. ముగ్గురి మృతదేహాలకు రాజోలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అందజేస్తామని పోలీసులు తెలిపారు. ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతిచెందడం ఈ ప్రాంతవాసులను కలవరపరిచింది. ఘటనపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు మలికిపురం పోలీసులు తెలిపారు.

కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

కడియం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి కడియం వెళ్లే కాలువలో సుమారు 30 నుంచి 40 ఏళ్ల గల మహిళ మృతదేహం నీటిలో తేలియాడుతున్నట్టు బుధవారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని వేమగిరిగట్టు వద్ద ఒడ్డుకు తీయించి పరిశీలించారు. మృతదేహంపై వంగపూవు రంగు చీర, బ్లౌజు ఉన్నాయి. మెడలో నల్లపూసల తాడు, కాళ్లకు మెట్టెలు ఉండడంతో వివాహితగా పోలీసులు గుర్తించారు. వేమగిరి గ్రామ రెవెన్యూ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.సురేష్ కేసు నమోదు చేశారు. మహిళ వివరాలు తెలిస్తే కడియం పోలీసుస్టేషన్‌కు తెలియపరచాలనికోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అద్దరిపేట విద్యార్థి


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జగదీష్

తొండంగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు కాకినాడ జిల్లా తొండంగి మండలం అద్దరిపేట విద్యార్థి పిక్కి జగదీష్ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు దుర్గాకుమారి తెలిపారు. ఈనెల 18న కాకినాడలో జరిగిన 300 మీటర్ల పరుగు పందెంలో జగదీష్ జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచ ఈనెల 29న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీలకు ఎం పికయ్యాడన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచి జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జగదీష్, వ్యాయామోపాధ్యాయులు మునుకోటి దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

చోరీ కేసుల్లో నిందితుడికి ఆరు నెలల జైలు

కాకినాడ క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తూ దొరికిన వ్యక్తిపై నేరారోపణ రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ మూడో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి.శ్రీదేవి బుధవారం తీర్పు చెప్పారు. కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన 42 ఏళ్ల కాట్లోజు లోవరాజు గతంలో బంగారం పనిచేసేవాడు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ద్విచక్ర వాహనాలను తస్కరించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో పార్క్ చేసిన మోటారు వాహనాలను ఎత్తుకెళ్లి అమ్ముకుని జల్సా చేసేవాడు. ఈ విధంగా ఏడు కేసుల్లో నిందితుడైన లోవరాజును కాకినాడ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో వాదోపవాదనల అనంతరం అతడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కె.సుధారాణి వాదించారు.

అంగన్‌వాడీకి వెళ్లి.. అంతలోనే కన్నుమూసి!

- ఫిట్స్‌తో ఐదేళ్ల చిన్నారి మృతి


మృతిచెందిన చిన్నారి జనని

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఫిట్స్ బారిన పడి ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన అల్లూరి జిల్లా చింతూరు మండలంలోని కుయుగూరులో బుధవారం జరిగింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల మేరకు.. పెద్దసీతనపల్లికి చెందిన శ్యామల మారయ్య, రమాదేవి దంపతుల కూతురు జనని (5) కుయుగూరులోని అమ్మమ్మ రవ్వ దుర్గమ్మ ఇంటి వద్దనే ఉంటూ అంగన్‌వాడీలో చదువు కుంటుంది. ఈ క్రమంలో బుధవారం సమీపంలోని అంగన్‌వాడీ సెంటరుకు వెళ్తూ మార్గమధ్యలో రేగికాయల చెట్టు వద్ద కింద పడి ఉన్న పండ్లను ఏరుకుని తింటూ అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లింది. కాగా కొద్ది నిమిషాల వ్యవధిలో జననికి ఫిట్స్ వచ్చాయి. విషయం తెలుసుకున్న జనని అమ్మమ్మ దుర్గమ్మ కుటుంబసభ్యులందరూ జననిని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జనని అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారని ఎస్ఐ తెలిపారు.

గంట పడుకుని నిద్ర లేస్తానని చెప్పి..

- కాపవరంలో ఉరేసుకున్న యువకుడు
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు


నీలకంఠేశ్వరుడు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రవిచంద్రకుమార్

బిక్కవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరంలో పోసిన నీలకంఠేశ్వరుడు (26) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కాపవరానికి చెందిన నీలకంఠేశ్వరుడు అనపర్తి ఐఎల్‌టీడీ ఫ్యాక్టరీలో కూలీ పని చేస్తుంటాడు. మంగళవారం పనికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి పడుకున్నాడు. బుధవారం ఉదయం అతడి తల్లి నిద్రలేపగా రాత్రి లేటుగా వచ్చానని.. ఒక గంట పడుకుని లేస్తానని చెప్పి మళ్లీ పడుకున్నాడు. మళ్లీ నిద్ర లేపడానికి తల్లి ప్రయత్నించగా తలుపు వేసి ఉంది. దీంతో ఎంతకొట్టినా తలుపు తీయకపోవడంతో పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. నీలకంఠేశ్వరుడు మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. మృతుడికి ముగ్గురు సోదరులు ఉన్నారు. వారికి పెళ్లిళ్లు అయిపోయాయి. నీలకంఠేశ్వరుడికి ఏ బాధలు లేవని, ఉరి వేసుకుని చనిపోవడానికి కారణాలు తెలియరావడం లేదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

విహారయాత్రలో విషాదం

- కాలువలో యువకుడి గల్లంతు


జగదీష్ (ఫైల్)

మోతుగూడెం/చింతూరు, నవనంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొల్లూరు జల విద్యుత్ ఉత్పాన కేంద్రానికి చెందిన కాలువలో మునిగి గనిశెట్టి జగదీష్(26) గల్లంతయ్యాడు. ఈ ఘటన బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నుంచి గనిశెట్టి జగదీష్, బీ.చిరంజీవి, కె.భాను, ఆర్.రాందేవ్, పీ.నాగేంద్ర, బీ.హరి మోతూగూడెం జలపాతాల విహారయాత్రకు కారులో కలిసి వచ్చారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వారంతా బోర్‌బే వద్దకు చేరుకున్నారు. తదుపరి జగదీష్, నరేంద్ర, భాను కాలువలో స్నానానికి దిగారు. కాలువ ప్రవాహం ఉధృతి అవుతుండడంతో జగదీష్ మినహా మిగిలిన ఇద్దరు ఒడ్డుకు చేరుకున్నారు. జగదీష్ కూడా ఒడ్డుకు చేరేం దుకు ప్రయత్నం చేస్తుం డగానే ప్రవాహంలో కొట్టు కుపోయాడు. మిగిలిన వారంతా జగదీష్‌ని రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. సాయంత్రం 6 గంటల వరకు కాలువలో గాలించినప్పటికీ జగదీష్ ఆచూకీ లభ్యం కాలేదు. రాందేవ్, జగదీష్ బావ బామ్మర్దులు. రాందేవ్ మోతుగూడెం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశాడు. కాగా వారంతా డ్రైవింగ్, మెకానిక్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జగదీష్ గల్లంతు కావడంతో ఎంతో విలపిస్తున్నారు.


విహారయాత్రలో స్నేహితులు దిగిన ఫొటో

రాత్రి లాడ్జిలో రూం తీసుకుని..
ఉదయం డ్రైనులో శవంగా కనిపించి..

- పురుగుల మందుల కంపెనీ ఉద్యోగి అనుమానాస్పద మృతి
- కేసు నమోదు చేసిన పోలీసులు

రాజమహేంద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాత్రి లాడ్జి రూం తీసుకున్న వ్యక్తి.. ఉదయానికి అదే లాడ్జి పక్కన డ్రైనులో శవమై కనిపించాడు. రాజమహేంద్రవరం త్రీటౌన్ ఎస్ఐ సుభాని తెలిపిన వివరాల ప్రకారం... నూజివీడుకు చెందిన టి.చెన్నారావు (38) ఓ పురుగుల మందుల కంపెనీలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల అసిస్టెంట్ సేల్స్ మేనేజరుగా ఇటీవల ఉద్యోగంలో చేరాడు. విధుల్లో భాగంగా మంగళవారం పశ్చిమ గోదావరిలోని దుకాణాలకు వెళ్లి పని చూసుకుని సాయంత్రానికి మరొకరితో కలిసి రాజమండ్రి చేరుకున్నాడు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన బాధ్యులు ఇద్దరితో కలిసి రాత్రి 4వ అంతస్తులో ఉన్న రూంలో మద్యం తాగి ఉండొచ్చని ఎస్ఐ పేర్కొన్నారు. కారు డ్రైవర్లు వేరేక రూంలో నిద్రిస్తున్నారని, తెల్లవారుజామున 5.30గంటల ప్రాంతంలో చెన్నారావు బాల్కనీలోకి వచ్చి ప్రమాదవశాత్తూ పడిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నామన్నారు. ఉదయం డ్రైనులో మృదేహాన్ని గమనించిన స్థానికుల సమాచారం మేరకు మార్చురీకి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.


డ్రైనులో చెన్నారావు మృతదేహం

ఉలిగోగులలో భూ వివాదం

- 20 జీడిమామిడి చెట్లు నరికి వేత


ఉలిగోగులలో నరికి వేసిన జీడిమామిడి చెట్లు

ప్రత్తిపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ బురదకోట పంచాయతీ పరిధిలో ఉన్న ఉలిగోగుల గిరిజన గ్రామంలో భూ వివాదం ఏర్పడింది. గిరిజనులు భూముల్లో పెంచుతున్న పెంచుకున్న 20 జీడిమామిడి చెట్లను గిరిజనేతరులు నరికి వేయడంతో బుధవారం ఈ వివాదం వచ్చింది. చెట్లు నరికివేత దారులు, గిరిజనుల మధ్య వివాదం కారణంగా ప్రత్తిపాడు పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. ఉలిగోగులలో కాపూరి లవకుశలు, కాపూరి వెంకటలక్ష్మి, సిద్ద బూరమ్మలు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న 20 ఎకరాల భూముల్లో రూ.10లక్షల విలువైన చేసే తమ జీడిమామిడి చెట్లను అన్యాయంగా నరికి వేశారని బాధితులు వాపోయారు. 20 ఎకరాల భూముల వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉందని, ఈ భూమిపై హక్కులు కోర్టు నిర్ధారించుకుండానే గిరిజనేతరులు దౌర్జన్యాలకు దిగుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వివాదాస్పద భూముల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు సంఘటనా స్థలానికి తరలివచ్చారు.

ఇందిరా గాంధీకి నివాళి

యానాం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) యానాంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. స్థానిక ఇందిరాగాంధీ సర్కిల్, భీమనగర్ జాతీయ రహదారి ముఖ ద్వారం వద్ద గల ఆమె విగ్రహాలకు పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ఎస్పీ వరదరాజన్, మున్సిపల్ కమిషనర్ అద్దంకి మల్లికార్జునరావు నివాళులర్పించారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే గిడ్డి

రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ నగదు జమ




అయినవిల్లి: చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఐ.పోలవరం: చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

అయినవిల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో భాగంగా రెండో విడత నిధుల చెక్కులు రైతులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొదటి విడతగా రూ.7వేలు, రెండో విడతగా రూ.7వేలు, రాష్ట్రంలో 46,85,838మందికి రూ.6310కోట్లు లబ్ధి చేకూర్చిందన్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలోని పి.గన్నవరంలో 7379మంది రైతులకు రూ.5.04కోట్లు, అయినవిల్లిలో 6225మంది రైతులకు రూ.4.21కోట్లు, అంబాజీపేట రూ.4369కోట్లు, మామిడికుదురు మండలంలో 5754మంది రైతులకు రూ.3.97కోట్లు మొత్తం నియోజకవర్గంలో 23,727మంది రైతులకు రూ.16.22కోట్లు రెండో విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయ న్నారు. అన్నదాత కుటుంబాల్లో ఆనందం నింపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ఐ.పోలవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుల వల్లే పంటకాల్వలు, డ్రైన్స్ ఆక్రమణలకు గురవుతున్నాయని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు వ్యాఖ్యానించారు. హైడ్రా తరహా చట్టంతో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులను నియోజకవర్గ స్థాయిలో విడుదల సందర్భంగా ఐ.పోలవరంలో బుధవారం జరిగిన రైతు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసమావేశంలో కొంత మంది రైతులు డ్రైన్ల ఆక్రమణపై ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 23,449మంది రైతులకు రూ.15.43కోట్లు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదలైనట్టు ఆయన ప్రకటించారు. డ్రెయినేజీ వ్యవస్థ పటిష్టతకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌ల దృష్టికి తెస్తానన్నారు. కోనసీమలో డ్రెయిన్ల ఆధునికీకరణకు రూ.వెయ్యి కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, స్పెషలాఫీసర్ ఎస్.మధుసూదన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, మంచాల గంగసూర్యనారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, చెల్లి అశోక్, నీటి సంఘాల అధ్యక్షులు చిలుకూరి సుబ్బరాజు, రాయపురెడ్డి స్వామినాయుడు, చోడిశెట్టి నాగబాబు, సాగి వాసురాజు, ధూళిపూడి బాబి, చెల్లి సురేష్, నడింపల్లి సుబ్బరాజు, తాడి జానకీరామ్, ధూళిపూడి చక్రం, లంకలపల్లి మునిరాజు, పెంట రవిప్రసాద్, చిక్కాల శ్రీనివాస్, మద్దిరెడ్డి కుమార్, గుద్దటి జమ్మి, రంబాల రమేష్, సాధనాల త్రిమూర్తులు, చింతలపాటి తాతబాబు, బొంతు శ్రీరాములు, ఏడీ గౌతమ్, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, రైతులు పాల్గొన్నారు.

రూ.3.21కోట్ల నిధులు జమ

అల్లవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని 4,661మంది రైతుల బ్యాంకు ఖాతాలకు అన్నదాత సుఖీభవ రెండో విడతగా రూ.3 21కోట్ల నిధులు జమ అయ్యాయని మండల వ్యవసాయాధికారి కడలి విజయ్ బుధవారం తెలిపారు. ఒక్కో రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు చొప్పున మొత్తం రూ.7వేలు రైతుల ఖాతాలకు జమ అయ్యాయన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనాభివృద్ధికి అటల్ ల్యాబ్స్



పేరూరు జడ్పీ హైస్కూలులో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జిల శిక్షణను ప్రారంభిస్తున్న డీఈవో

అమలాపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి శాస్త్రీయ ఆలోచనలను అభివృద్ధి చేసేందుకు అటల్ ల్యాబ్ ఏర్పాటు చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాలోని 43 ప్రభుత్వ అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జిలకు బుధవారం నిర్వహించిన వర్కుషాపును డీఈవో ప్రారంభించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వీలుగా వినూత్న ఆలోచనా విధానాలు వివరించాలన్నారు. తొలుత సాల్ట్ వాటర్‌ను కండక్టర్‌గా ఉపయోగించిన లైటింగ్ ల్యాంప్‌తో దీప ప్రజ్వలన నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం సమన్వయకర్తగా చేపట్టిన వర్కుషాపును రాష్ట్ర కోఆర్డినేటర్ హేమ పాల్గొని పలు సూచనలు చేశారు. శిక్షకులుగా అనిల్, స్వాతి వ్యవహరించగా అటల్ హబ్ నోడల్ అధికారిగా పావని పాల్గొన్నారు. అటల్ ల్యాబ్ ఇన్‌చార్జులు రూపొందించిన తొమ్మిది ప్రాజెక్టులనుప్రదర్శనగా ఉంచి విద్యార్థులతో ప్రయోగాలు చేయించారు. ప్రధానంగా అటల్ ల్యాబ్ నిర్వహణపై అనేక అంశాలపై శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం విజయకుమారి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే దేవ



కరవాకలో వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మామిడికుదురు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. కరవాకలో ఎమ్మెల్యే బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలో మండల పరిషత్ నిధులతో నిర్మించిన 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను, జేజేఎం నిధులతో నిర్మించిన సంపును ప్రారంభించారు. ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో గ్రామంలోని సునామీ కాలనీలో నిర్మించిన 40 కిలోవాట్ల సామర్థ్యం గల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును ప్రారంభించారు. కాలనీలోని 20మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పీఎంఎంఎస్‌వై నిధులు రూ.26కోట్లతో మంజూరైన జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలను పంపిణీ చేశారు. అన్నదాత రెండో విడత పంపిణీ కింద నియోజకవర్గ పరిధిలో 23,293 మంది రైతులకు రూ.15.56కోట్లు ఖాతాల్లో జమయ్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ రాజోలు ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కుసుమ వనజాకుమారి, సర్పంచ్ రేకాడి నరసింహమూర్తి, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, బందెల పద్మ, మండల వ్యవసాయాధికారి ఎస్వీవీ సత్యనారాయణ, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ జయంతి
నివాళులర్పించిన నాయకులు

అమలాపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని అమలాపురం ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కోనసీమ మహిళా మండలి మాజీ అధ్యక్షురాలు పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యెండూరి సీత, మహబూబ్ షకీల, యెరుబండి శారదాంబ తదితరులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. విద్యార్థినులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పోలిశెట్టి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. హైస్కూలు సెంటర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహానికి ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జోగి అర్జునరావు, మహిళా అధ్యక్షురాలు మహబూబ్ షకీలా, జిల్లా ప్రధాన కార్యదర్శులు వస్కా బాబు, సుగ్గు ప్రసాద్, పులుసుగంటి ప్రకాష్, అయితాబత్తుల కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానిగా దివంగత ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఆమె జయంతిని పురస్కరించుకుని మామిడికుదురు బస్టాండు కూడలిలో ఇందిరా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు అప్పన రామకృష్ణ, నీతిపూడి బాలసత్యనారాయణ, వాణరాశి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు ముందే రికార్డుల్లోని తప్పులను సరిదిద్దుకోవాలి

అమలాపురంరూరల్,నవంబరు19(ఆంధ్రజ్యోతి): వచ్చేఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు తమ వివరాలు సరిదిద్దుకునే అవకాశాన్ని పాఠశాల విద్యాశాఖ కల్పించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థుల డేటాను యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూ డైస్)తో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. పాఠశాల రికార్డుల్లో ఉన్న విధంగా విద్యార్థుల పూర్తి వివరాలు ఉన్నాయో లేదో యూ డైస్ వెబ్‌సైట్‌లో సరి చేసుకోవాలని తెలిపారు. ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వివరాలను ఒకసారి సరిచూసుకుని తప్పులకు ఆస్కారం లేకుండా ప్రధానోపాధ్యాయులకు తెలియచేస్తే వారు అప్‌లోడ్ చేస్తారని వివరించారు. పబ్లిక్ పరీక్షల అనంతరం ఎటువంటి తప్పులు సరి చేసుకోవడానికి ఉండదన్నారు. ముందుగానే విద్యార్థులు, తల్లిదండ్రులు మేలుకుని తప్పులను సరిదిద్దుకోవాలన్నారు. పదోతరగతి పబ్లిక్ పరీక్ష ఫీజు రూ.125 చొప్పున చెల్లించాలన్నారు. అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేస్తే అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలకు ఇదే ఫీజు వర్తిస్తుందన్నారు.

'సీఆర్పీల బదిలీలు నిలిపివేయాలి'



ప్రాజెక్టు కోఆర్డినేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్పీలు

ముమ్మిడివరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీఆర్పీల బదిలీలు నిలిపివేసి ఏ మండలంలో పనిచేసేవారిని ఆ మండలంలోనే పనిచేసేలా అవకాశం కల్పించాలని క్లస్టర్ రీసోర్స్‌పర్సన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకట్రావు ఆధ్వర్యంలో బుధవారం క్లస్టర్ రీసోర్స్‌పర్సన్లు అంతా ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలో ఉన్న విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లి డీఈవో షేక్ సలీంబాషాకు, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీలకు వినతిపత్రాలు అందించారు. తమకు కేవలం రూ.23,500 జీతం చెల్లిస్తున్నారని, ఇతర జిల్లాకు బదిలీ చేస్తే ఆ వేతనం సరిపోదని, తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.రవికుమార్, ఎం.అర్జున్, డీఎన్ మల్లేశ్వరరావు, కెపీ రాములు, కె.సుబ్రహ్మణ్యం, బి.కిశోర్, ఎం.అనూష, ఎ.రాజేంద్రకుమార్, ఎం.నీలాంబరం, జి.నాగన్న, పి.మురళీకృష్ణ, సీహెచ్ వెంకన్నబాబు, ఎం.శ్రీనివాస్, కె.నాగభూషణం, ఎం.చంద్రరావు, కేఎస్సార్ శ్రీనివాసరావు, ఎన్.రవీంద్ర, ఎంఆర్ భద్రరావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారుల నమోదు వేగవంతం చేయాలి

ఐ.పోలవరం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గంలో గృహనిర్మాణ లబ్ధిదారుల నమోదు ప్రక్రియ వేగవంతం చెయ్యాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు హౌసింగ్ అధికారులను ఆదేశించారు. మురమళ్ళ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో గృహనిర్మాణాలకు చేపట్టిన పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గృహనిర్మాణ శాఖా మంత్రి పార్థసారధితో ఆయన ఫోన్లో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణాలు ప్రారంభించిన అన్ని గృహాలకు అనుమతులు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో గృహనిర్మాణాల ప్రస్తుత పరిస్థితిని ఆయన మంత్రికి వివరించారు. టీడీపీ మండలాల అధ్యక్షులు సాగిరాజు సూరిబాబురాజు, ధూళిపూడి వెంకటరమణ, డి.శ్రీనివాసరావు, చెల్లి సురేష్, కట్టా సత్తిబాబు, గృహనిర్మాణ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఖాళీ సీట్లకు స్పాట్ ప్రవేశాలు

రాజోలు, నవంబరు19(ఆంధ్రజ్యోతి):రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి సింగిల్ మేజర్ ప్రోగ్రాంలో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ ప్రవేశాలు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు తెలిపారు. రాజోలులో బుధవారం విలేకరులతోమాట్లాడుతూ బీఏ స్పెషల్ ఇంగ్లీషు, బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ మేథమెటిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ బోటనీ, జువాలజీల్లో ఖాళీగా ఉన్న సీట్లను ఈనెల20 వరకు ప్రవేశాలు జరుగుతాయని తెలిపారు.

రిజర్వేషన్ శాతం పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది

రాజోలు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న జనాభాకు అనుగుణంగానే ఎస్టీ, ఎస్సీ వర్గాలకు రిజర్వేషన్ల శాతం పెంచాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని దళిత చైతన్యవేదిక నాయకులు అన్నారు. పాలగుమ్మిలో దళిత నాయకులు చుట్టుగుళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో దళిత చైతన్యవేదిక నాయకులు బుధవారం ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ ఇంటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రతీ ఇంటి గుమ్మాలకు అంబేడ్కర్ చిత్రపటంతో ఉన్న స్టిక్కర్‌ను అతికించారు. ఈసందర్భంగా దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నేటికీ వివక్షత కొనసాగుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, చిలకపాటి శ్రీధర్, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, చింతా శ్రీను, బొడ్డపల్లి పుల్లయ్యపాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు

రాజోలు,నవంబరు19(ఆంధ్రజ్యోతి):పొన్నమండ పీఏసీఎస్ కార్యాలయంవద్ద72వఅఖిల భారత సహకార వారోత్సవాలు సందర్భంగా సహకార జెండాను పీఏసీఎస్ చైర్మన్ అడబాల సూర్యవెంకటరామకృష్ణ ఆవిష్కరించారు.

ప్రకృతి విపత్తులు అధిగమించాలి



ఏదైనా విపత్తు వస్తే స్థానిక వస్తువులతో ఎలా కాపాడుకోవాలో వివరిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

పి.గన్నవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో ఎదురయ్యే ప్రతి ప్రమాదాన్ని అధిగమించేందుకు విద్యార్థులు సిద్ధం కావాలని టీమ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రకుమార్‌సరోజ్ పిలుపునిచ్చారు. లంకలగన్నవరం హైస్కూల్లో బుధవారం ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏర్పాటు చేసిన మాక్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమంలో ఆయన మాట్లా డారు. విజయవాడ ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ కమాం డెంట్ వీవీఎస్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో మా బృందం గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం ప్రమాదవశాత్తు భవనం కూలిపోతే మనల్ని మనం ఎలా కాపాడుకోవాలి, వరదల సమ యంలో బోటుపై ప్రయాణం చేసే సమయంలో తీసుకో వాల్సిన జాగ్రత్తలు, భూకంపం సంభవిస్తే విపత్తు నుంచి ఎలా బయటపడాలి, అగ్నిప్రమాదం సంభవిస్తే మనం మనల్ని కాపాడుకోవడంతో పాటు ఇతరులను ఎలా రక్షించాలి, పాము కాటు వేసినప్పుడు ప్రథమ చికిత్స చేయడం, సీపీఆర్ చేసే విధానం తదితర అం శాలను మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానేపల్లి బాలుర, బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బాలికల పాఠశాలలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మాక్‌ఎక్సర్‌సైజ్ ద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో మనల్ని మనం ఎలా కాపాడుకోవాలి, బాధితులను ఎలా రక్షించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు జి.రామకృష్ణరావు, కె.వి.సూర్యనారాయణమూర్తి, జి.శ్రీనివాసరావు, నాయకులు మద్దుల అనూరాజేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమావల్లభేశ్వరస్వామి ఆలయంలో పూజలు

ముమ్మిడివరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడి శ్రీఉమావల్లభేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్షపత్రి పూజ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శైవాగమ పండితులు డీఎస్ శాస్త్రి, ఆలయ అర్చకుడు బాదంపూడి శ్రీరామచంద్రమూర్తి, సత్తిబాబు ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అల్పాహారం, సాయంత్రం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మాదాల నాగసత్యమంగాకుమారి, చింతలపూడి బాబూరావు, మాదాల బుజ్జి, మాదాల పరంకుశం, నయినాలశెట్టి శ్రీను, యేడిద శివ, రామాయణం రాంబాబు, రామాయణం రాజు, మాదాల సత్తిబాబు, మాదాల వనేశ్వరరావు, అరిగెల లక్ష్మణరావు, బైవరపు నాగేశ్వరరావు, యేడిద దొరబాబు,మాదాల త్రిమూర్తులు, కూరపరెడ్డి శ్రీరామమూర్తి, వడలి పూర్ణయ్య, పాయసం సూరిబాబు, పాయసం పుల్లయ్య పాల్గొన్నారు.

సిద్ధివినాయకుడికి రూ.2.10లక్షల విరాళం



అయినవిల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన దువ్వూరి వెంకటరమణ బుధవారం కుటుంబ సమేతంగా అయివిల్లి సిద్ధివినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం విఘ్నేశ్వరస్వామివారికి రూ.2.10లక్షలు విరాళం అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఈవో ముదునూరి సత్యనారాయణరాజు దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేసి అభినందించారు.

వాలీబాల్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక

అల్లవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గోడి బాలుర గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి కె.ఉదయ్ జిల్లాస్థాయి అండర్-14 విభాగంలో వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జడ్పీటీసీ గౌతమి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ వై.భుజంగరావు, జి.గణపతి, పి.దుర్గాప్రసాద్, సర్పంచ్ తోట శ్రీదేవి నరసింహారావు, ఎంపీటీసీ కాండ్రేగుల వాణీఅచ్యుతం తదితరులు ఉదయ్‌కు అభినందనలు తెలిపారు.

ఘనంగా కార్తీక వనసమారాధనలు

అమలాపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ గోదావరి సెంట్రల్ డివిజన్ ఆధ్వర్యంలో సమనస లాకుల వద్ద బుధవారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇరిగేషన్‌శాఖ అధికారులు, సిబ్బందితో కార్తీక వనసమారాధన నిర్వహించారు. అనంతరం సెంట్రల్ డివిజన్ పరిధిలోని ఇరిగేషన్ అధికారులు, నీటిసంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులతో ప్రాజెక్టు చైర్మన్ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు.ఈనెల20నకలెక్టర్‌తో జరిగే సమావేశంలో చర్చించే అంశాలపై సూచనలు స్వీకరించారు. ఏయే అంశాలను కలెక్టర్ ఎదుట ప్రస్తావించాలో అధికారులు నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరావు, గన్నవరండివిజన్, అమలాపురం డివిజన్ డీఈఈలు ప్రసాదరాజు, శ్రీరామ్, జనార్ధనరావు, నీటిసంఘాల డీసీలు వెంకటగోపాలరాజు, కాకర శ్రీనివాస్, రాజులపూడి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరాజు, అడబాల వెంకన్నబాబు, ఇరిగేషన్ ఏఈలు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ముమ్మిడివరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో గుజరాత్ హెచ్‌బిఆర్‌పీ యూనివర్శిటీలో నవంబరు 7న జరిగిన షూటింగ్ బాల్ పోటీల్లో 44వ జాతీయ జూనియర్ బాలుర, బాలికల విభాగంలో కొత్తలంక జడ్పీ హైస్కూలు 8వ తరగతి విద్యార్థిని గెద్దాడ మేఘన ఉత్తమప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రం అందుకున్నట్టు ప్రధానోపాధ్యాయుడు గోవర్ధనగిరిరావు తెలిపారు. మేఘనను పాఠశాల హెచ్‌ఎం, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ జయన బాబ్జి, పీడీ కె.సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్యే పరామర్శ

మామిడికుదురు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల వెన్నెముక శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పెదపట్నంలంక సర్పంచ్‌ను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకుని విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అదేగ్రామానికి చెందిన కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న పేరాబత్తుల చిరంజీవిని కలసి పరామర్శించి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. జనసేన మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, తుండూరి బుజ్జి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడికుదురు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరం సబ్‌స్టేషన్ పరిధిలో బీఏవై మెయింటినెన్స్ పనులు, ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. నగరం, మామిడికుదురు, పాశర్లపూడి, పాశర్లపూడి బాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, అప్పనపల్లి, పెదపట్నం, తాటిపాక, మొగలికుదురు గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులకు పరామర్శ

రాజోలు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం లక్కవరానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్ ఇద్దరు పిల్లలతో చించినాడ వంతెన పైనుంచి నదిలోకి దూకేసి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. నదిలో దొరికిన దుర్గాప్రసాద్, మోహిత్, జాహ్నవి మృతదేహాలకు పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి బుధవారం తరలించారు. మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

అంతర్వేది, నవంబరు19(ఆంధ్రజ్యోతి):అంతర్వేదిపాలెం గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం మహిళాదినోత్సవం పురస్కరించుకుని మాజీప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు కబడ్డీ, కోకో పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు కె.రాంబాబు నిర్వహించారు. విజేతలకు, జడ్జీలకు బహుమతులు అందించారని గ్రంథాలయ అధికారిణి వై.వెంకటలక్ష్మి తెలిపారు.

తహశీల్దార్‌కు డీలర్ల సన్మానం

అంతర్వేది, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావును మండల రేషన్ డీలర్లు బుధవారం సన్మానించారు. మొంథా తుపాను నేపథ్యంలో రెవెన్యూ సేవలకు ప్రభుత్వం అవార్డు ప్రకటించడం, అలాగే పేదలకు డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ శరవేగంగా చేసి సేవలు అందించడంతో డీలర్లంతా ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో డీటీ సీఎస్ రాజు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

దహన ఖర్చులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

అంబాజీపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిరతపూడికి చెందిన సత్యాల నాగేశ్వరరావు బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. చిరతపూడి గ్రామం కొంబత్తులవారిపేటలోని నాగేశ్వరరావు మృతదేహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నివాళులర్పించారు. ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించడంతో ఎమ్మెల్యే గిడి స్పందించి రూ.20వేలు ఆ కుటుంబ సభ్యులకు అందించారు. ఆ కుటుంబానికి బాసట నిలుస్తానని ఆయన హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ పార్టీ యానాంలో ముసలం
• కమిటీలో అనర్హులకు స్థానం • పార్టీని వీడుతున్న ప్రసాద్ వర్గం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

యానాం,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ యానాం బ్లాక్ నూతన కమిటీలో అనర్హులకు ఉన్నతస్థానాలు కేటాయించడంపై ఆగ్రహించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ములకపాటి ప్రసాద్‌రాజు వర్గం పార్టీని వీడి బయటకు వచ్చారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన తమ వర్గానికి కనీస సమాచారం లేకుండా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈకమిటీలను రద్దు చేసి సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ వి.వైద్యలింగం, మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి, ఎమ్మెల్యేలు వైద్యనాథన్‌లు తమ వర్గానికి నమ్మకద్రోహం చేశారని ఆరోపించారు. దీని వల్ల రానున్న రోజుల్లో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొకతప్పదన్నారు. అనంతరం ప్రసాద్‌రాజు వర్గం అందరూ కాంగ్రెస్ పార్టీ కండువాలు తీసి పార్టీ నుంచి బయటకు వచ్చినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో చీకట్ల రామకృష్ణ, గిడ్ల బాలయోగి, బండారు పల్లం రాజు, పెనుమత్స వాసువర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

అమలాపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వాకర్స్ క్లబ్‌లు కీలక పాత్ర పోషించాలని అంతర్జాతీయ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి పేర్కొన్నారు. వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం అమలాపురం శ్రీకళా గ్రాండ్‌లో జిల్లా వాకర్స్ క్లబ్ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభావతి మాట్లాడారు. జిల్లా శాఖలో వివిధ విభాగాల్లో పనిచేసి అవార్డులు పొందిన ప్రతినిధులను జిల్లాశాఖ తరపున అవార్డులు, మెమెంటోలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వపు అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ, డాక్టర్ గోకరకొండ నాగేంద్రరావు, బోనం సత్యవరప్రసాద్, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, వీవీఆర్ నాయుడు, బీకే కామేశ్వరరావు, పీఎల్ నరసింహం, మహిళా క్లబ్ అధ్యక్షురాలు వై.అనంతలక్ష్మి, కేవీ లక్ష్మి, పి.అనంతలక్ష్మి, వై.రామతులసి, ఎస్.పద్మావతి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అంతర్వేది, నవంబరు19(ఆంధ్రజ్యోతి):అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనం అనంతరం గుంటూరుకుచెందిన జొన్నలగడ్డ లలితాప్రసాద్ రూ.1,00,116 అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

సిద్ధివినాయకుడికి లక్ష బిల్వార్చన

అల్లవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరు సిద్ధివినాయక ఆలయం వద్ద బుధవారం లక్ష బిల్వార్చన, లక్ష్మీగణపతి హోమం, రుద్రాభిషేకం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈకార్యక్రమాలకు భక్తులు పోటెత్తారు. గ్రామస్తుల ధన సహాయంతో పోచినపెద్ది సాయి రామ్‌శర్మ బ్రహ్మత్వాన పూజలు జరిగాయి. జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. భవానీ మాలధారులు, అయ్యప్పస్వాములు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పూర్ణాహుతి, పూజల్లో పాల్గొన్నారు.

సిద్ధివినాయకుని ఆలయంలో విశాఖ ఎంపీ పూజలు

అయినవిల్లి, నవంబరు19(ఆంధ్రజ్యోతి):అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుడిని విశాఖ పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి భరత్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. తొలుత ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఎంపీకి స్వాగతం పలికారు. దేవస్థాన ప్రాంగణంలోని కేశవస్వామి, అన్నపూర్ణాదేవి, విశ్వేశ్వరస్వామి, కాలభైరవస్వామిని ఆయన దర్శించుకున్నారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మోకా ఆనంద్‌సాగర్, మెట్ల రమణబాబు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యపురాజు సత్యనారాయణరాజు మద్దాల సుబ్బారావు, సలాది బాబూరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, మేడిశెట్టి అంజిబాబు, సలాది పుల్లయ్యనాయుడు, జాస్తి శ్రీనివాసరావు, వారా లక్ష్మీనరసింహరామ్, సర్పంచ్‌లు కాకర శ్రీనివాస్, బొబ్బా ప్రభాత్‌కుమార్, మేడిద దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గరుడేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన

పి.గన్నవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని బుధవారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం బిల్వార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో సమీప గ్రామాల మహిళలు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వాడాలి

మామిడికుదురు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ విధిగా మరుగుదొడ్లు వాడాలని డీఆర్డీఏ డీపీఎం అన్నపూర్ణ సూచించారు. వరల్డ్ టాయిలెట్ డేను పురస్కరించుకుని మామిడికుదురు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఇంటింటికీ మరుగుదొడ్డి ఉండాలని, అవి లేకపోతే ప్రజలు ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటారని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రమణ, సీసీలు ఆనంద్, వాణి, వీవోఏలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పలగుప్తం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల పలువురు టీడీపీ నాయకులు మృతి చెందగా ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు బుధవారం పరామర్శించారు. ఉప్పలగుప్తంలో వంగలపూడి జార్జి కుటుంబాన్ని, చల్లపల్లిలో నాగులపల్లి పవన్, కోన తాతారావు, సుంకర పేరయ్యనాయుడు కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆయన వెంట నియోజకవర్గ టీడీపీ యువత అధ్యక్షుడు గొలకోటి చిన్నా, గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, పోలిశెట్టి శివాజీ, కుంపట్ల నరసింహారావు, నిమ్మకాయల లక్ష్మణపేరయ్యనాయుడు తదితరులున్నారు.

గోడిలంక పీహెచ్‌సీ వైద్యాధికారిపై ఫిర్యాదు

అల్లవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గోడిలంక పీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేస్తున్న కె.బాలరాజు దుర్భాషలాడుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన్ను తక్షణమే బదిలీ చేయాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు సిబ్బంది బుధవారం ఫిర్యాదు చేశారు. ఆయన సిబ్బందిని వేధింపులకు గురిచేయడమే కాకుండా రోగులకు సరైన వైద్య సేవలు అందించడం లేదని ఆరోపించారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, టీడీపీ మండల కార్యదర్శి పశ్చిమాల ఏడుకొండలు, గోడిలంక పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

ఆలమూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో ఎ.రాజు సూచించారు. ఆలమూరు ఎస్సీ కాలనీలో మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డను బుధవారం ఆయన పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో జరగాలని నాణ్యత విషయంలో రాజీ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్తల సేకరణ, ఇంటింటికి చెత్త సేకరణ ప్రక్రియను ఆయన మహిళలను అడిగి తెలుసుకున్నారు.



ఆలమూరు ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సీసీరోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో

యువతకు స్ఫూర్తి ప్రదాత వల్లభాయ్ పటేల్

మండపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నేటి తరాలకు సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. మండపేటలో బీజేపీ సీనియర్ నేత కోనా సత్యనారాయణ సారధ్యంలో బుధవారం వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. అనంతరం ఏక్ భారత్ శ్రేష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 250 మంది విద్యార్థులు జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీని నేతలు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ వీర్రెడ్డి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి'

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, ఏఐకెఎంఎస్ నాయకులు వి.భీమశంకరం, ఐఎఫ్‌టీయు నాయకుడు చింతా రాజారెడ్డి డిమాండు చేశారు. మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు ఉన్నాయన్నారు. వెంటనే బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు.

సమస్యలతో ఇలా గడపాల్సిందేనా?

• నార్కెడిమిల్లిలో డ్రైనేజీతో ప్రజల పాట్లు • తాడిపూడి పంచాయతీ చెరువులో మృతి చెందిన చేపల వాసనతో స్థానికుల గగ్గోలు



ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లిలో వ్యర్థాలతో నిండిపోయిన డ్రైనేజీ

ఆత్రేయపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచకపోవడంతో మురుగునీరు వెళ్లే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నార్కెడిమిల్లిలోని దుర్గమ్మ గుడి వెనుక వైపున ఏటిగట్టు సమీపంలో మురుగు డ్రెయిన్ వెళ్లే మార్గం లేక నిల్వ ఉండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెంది సమీప ప్రాంతాల వారు రోగాల బారిన పడుతున్నారు. దీనిపై పలువురు స్థానికులు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఇక్కడి సమస్యను విన్నవించుకుంటున్న పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన మురుగు నీరంతా ఇక్కడే ఆగుతున్నదని స్థానికులంటున్నారు. ఆక్రమణలు తొలగించి మురుగు డ్రెయిన్ ముందుకు వెళ్లే చర్యలు చేపట్టాలని అధికారులను స్థానికులు వేడుకుంటున్నారు.

పంచాయతీ చెరువులో చెత్తా చెదారం

ఆత్రేయపురం మండలం తాడిపూడి పంచాయతీ చెరువులో చెత్తాచెదారం పెరిగిపోయి దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీ యంత్రాంగం పట్టించుకోకపోవడంతో ప్రజల ఇబ్బందులు వర్ణానాతీతంగా మారింది. తాడిపూడి పంచాయతీకి చెందిన 9 ఎకరాల పంచాయతీ చెరువు గతంలో ఎంతో శుభ్రంగా ఉండేదని స్థానికులు తెలిపారు. తొమ్మిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చేపల చెరువులను స్థానిక మత్స్యకారులకు లీజుకు ఇచ్చారు. లీజుదారులు చేపల చెరువు నిర్వహణ సరిగా చేయకపోవడంతో చెత్తా, చెదారంతో పాటు గుర్రపుడెక్క చేరిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని వ్యర్థాల సైతం చెరువులోకి చేరుతున్నాయని స్థానికులు అంటున్నారు. కొద్ది రోజుల నుంచి ఈ చెరువులో పెరుగుతున్న చేపలు చనిపోయి పైకి తేలడంతో దుర్గంధం వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారుల సైతం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెరువులోని చెత్తా, చెదారాన్ని తొలగించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



తాడిపూడి పంచాయతీ చెరువులో చేపలు తేలిపోయిన దృశ్యం

పూర్వపు విద్యార్థుల సందడి

మండపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) ఏడిదలో బుధవారం 1989-93 మధ్య క్రికెట్ ఆడిన సభ్యులంతా కలిసి సందడి చేశారు. కార్తీకమాసం సందర్భంగా మిత్రబృందం సభ్యులు 36 ఏళ్ల తర్వాత కలిసి సందడి చేశారు. కార్తీక వన సమారాధన నిర్వహించిన వారంతా అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

రామచంద్రపురాన్ని కాకినాడలో కలపాలని
పార్టీ పదవులకు రాజీనామా

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని డిమాండు చేస్తూ తెలుగుదేశం పార్టీ న్యాయ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్టు న్యాయవాది, టీడీపీ నాయకుడు దొమ్మలపాటి సత్యనారాయణ తెలిపారు. నియోజకవర్గాన్ని కాకినాడలో కలపాలని డిమాండు చేశారు.

జనసేనకు ఆళ్ల రాజీనామా:
రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లా లో కలపాలని డిమాండు చేస్తూ జనసేన సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు తోటపేటకు చెందిన ఆళ్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని జరుగుతున్న ఉద్యమంలో కీలకపాత్ర పోషించనున్నట్లు తెలిపారు.

ఆలయానికి ఇన్వెర్టర్ బహూకరణ

ఆలమూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆలమూరు జనార్దనస్వామి ఆలయానికి ఇన్వెర్టర్‌ను గ్రామానికి చెందిన వంటిపల్లి కాశీవిశ్వనాధం బుధవారం బహూకరించారు. దాతను ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు, అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవాన్, పలువురు భక్తులు అభినందించారు.





రాయవరంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల చెక్కులను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల. పక్క చిత్రంలో కొత్తపేటలో రైతులకు అన్నదాత నిధుల విడుదల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు

రాయవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం రాయవరంలోని కల్యాణ మండపంలో రైతులకు రెండో విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కును విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఆలమూరు సబ్ డివిజన్ ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. మండపేట నియోజకవర్గంలో రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు చెందిన 18,229 మంది రైతులకు రూ. 12 కోట్ల 42 లక్షల రూపాయలు మంజూరుకాగా ఎమ్మెల్యే చేతులమీదుగా చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం వాటర్ డీసీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు, టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస, రిమ్మలపూడి వేణుగోపాలదొర, ఏఎంసీ ఛైర్మన్ చింతపల్లి రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ కాదా ప్రభాకరరావు, కర్రి వెంకరెడ్డి, సహకార సంఘాల త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌లు శాకా కోటేశ్వరరావు, పిల్లి గణేష్, మేడపాటి రవీంద్రారెడ్డి, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రామకృష్ణ, ఎంపీడీవో కీర్తి స్పందన, తహశీల్దారు బీవీ భాస్కర్, ఏవో కేవీఎన్ రమేష్ కుమార్, కె.ప్రభాకర్, బి.రవి తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరం సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు సత్యం

రైతుల శ్రేయస్సే కూటమి ధ్యేయం

కె.గంగవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్నదాత మోములో చిరునవ్వే దేశానికి నిజమైన సంపదని టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం రెండో విడత నిధులు విడుదల కార్యక్రమాన్ని కె.గంగవరంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. అనంతరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ అక్కల రిష్యంత్‌రాయ్ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ బి.నాగకుమార్, తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్, వ్యవసాయశాఖ అధికారులు ఏ.సద్గురుమూర్తి, మణిదీప్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, రైతు సంఘం నాయకులు బులుసు శివప్రసాద్, కూటమి నాయకులు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, కర్రి చిట్టి బాబు, శంకర్‌నారాయణ, అల్లూరి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

కొత్తపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతు ల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం స్థానిక మం డల పరిషత్ ప్రాంగణంలో పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణతో కలిసి ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. కొత్తపేట నియోజకవర్గానికి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల కింద 23,018 మంది రైతులకు రూ.15.26 కోట్లు జమ అయినట్టు ఎమ్మెల్యే తెలిపారు. రైతులు సేంద్రియ సాగు ప్రకృతి సేద్యంపై దృష్టిసారించాలని కోరారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎంవీ రామారావు, పాలూరి సత్యానందం, బూసి జయలక్ష్మి, కె.శ్రీనివాస్, ధరణాల రామకృష్ణ, ముత్యాల బాబ్జి, పల్లి భీమారావు, సి.జగన్నాథం, వ్యవసాయాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిని హాజరుపరిచిన ఎక్సైజ్ పోలీసులు

బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడి

రావులపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం పరిధిలోని లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లిలో బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకుని రావులపాలెం తహశీల్దారు బీఎం ముక్తేశ్వరరావు వద్ద బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ కాత్యాయని తెలిపారు.



పేరవరంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సారా తయారీ విక్రయ స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు జరిపారు. మండలంలోని పేరవరం లంక ప్రాంతంలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 900 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ కాత్యాయని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ కె.అన్నవరం సిబ్బంది పాల్గొన్నారు.

హోటల్‌పై ఆహార నియంత్రణ
అధికారుల తనిఖీలు

మండపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండపేట వున్న బేరాకాస్ హోటల్‌పై మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావుకు వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఆహార నియంత్రణ అధికారులు దాడిచేసి తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామయ్యతోపాటు మున్సిపల్ శానిటరీ సిబ్బంది దాడులు చేసి హోటల్‌లో ఉన్న వస్తువుల శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించామని అధికారులు తెలిపారు. బుధవారం జరిపిన దాడుల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో సహా సెక్రటరీలు ఆర్.రాజేంద్ర, పీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక సందడిలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఎంతో పవిత్రమైన మాసమని సనాతన ధర్మం మనకి శరణ్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట మున్సిపల్ ఉద్యోగులు బుధవారం ఏర్పాటు చేసిన కార్తీక వనసమారాధనకు ఎమ్మెల్యే హాజరై ఉసిరి చెట్టు వద్ద ఉద్యోగులతో కలిసి పూజలు చేశారు. అనంతరం ఉద్యోగులతో కలిసి వన భోజనం చేశారు. తాపేశ్వరం పోలిశెట్టి సత్తిరాజు భూషణం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కార్తీక వనసమారాధనలో విద్యార్థులతో కలిసి వనభోజనాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు పిరమిడ్ గురువులు నల్లమిల్లి విజయ భాస్కరరెడ్డి భోజనాలు ఏర్పాటు చేయగా ఆయన్ను ఎమ్మెల్యేతో పాటు ఉపాధ్యాయులు, నిర్వాహకులు అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కోటి సంతకాల సేకరణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించవద్దని కోరుతూ వైసీపీ నిర్వహిస్తున్న కోటి సంతకాల ఉద్యమాన్ని రామచంద్రపురం వీఎస్ఎం కళాశాల వద్ద నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, వైసీపీ నాయకులు సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.భవానీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ వాసుపై వీగిన బలపరీక్ష

• కోరం లేక పిటిషన్‌ను తిరస్కరించిన ఆర్డీవో అఖిలప్రియ
• మండపేట ఎంపీపీ పదవిపై వీడిన ఉత్కంఠ

మండపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండపేట మండల పరిషత్ అధ్యక్షుడు ఉండమట్ల శ్రీనువాస్, వైస్ ఎంపీపీ గజ్జి వెంకటరమణలపై చర్యలు తీసుకోవాలంటూ వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, సహచర వైసీపీ ఎంపీటీసీలతో కలిసి గతనెల 23న రామచంద్రపురం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఫిర్యాదు మేరకు రామచంద్రపురం ఆర్‌డీవో అఖిలప్రియ బుధవారం మండపేట మండల పరిషత్ కార్యాలయంలో పోలీసు బందోబస్తు మధ్య ఎంపీటీసీల బలపరీక్షను నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య జరిగిన బలపరీక్షకు సంబంధించి వైసీపీకి చెందిన 9 మంది ఎంపీటీసీలు మాత్రమే హాజరు కావడంతో కోరం కాలేదు. ఎంపీపీ వాసుతో సహా అతడి అనుచరులు బలపరీక్షకు హాజరు కాలేదు. దీంతో పసుమర్తి చేసిన ఫిర్యాదును తిరస్కరించినట్టు బలపరీక్ష అనంతరం స్థానిక విలేకరులకు ఆర్డీవో తెలిపారు. దీంతో ఎంపీపీ వాసుపై బలపరీక్షకు ఫిర్యాదు చేసిన వైసీపీ ఎంపీటీసీలు ఖంగుతిన్నారు. ఈ నేపథ్యంలో వాసు ఎంపీపీగా కొనసాగనున్నారు. ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు బయటకు వచ్చిన తర్వాత తమ ఎంపీటీసీలు ప్రలోభాలకు గురయ్యారని తమ బలం తగ్గడంతో బలపరీక్ష వీగిపోయిందన్నారు. మండపేట పట్టణ సీఐ సురేష్ సారధ్యంలో మండపేట రూరల్ ఎస్ఐ కిషోర్, పట్టణ ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మండపేట మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు ఏవీ రమణ, అమర్‌నాథ్, సుబ్బారావు, అనిల్‌కుమార్, వర్మ, పి.శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిలప్రియ

సీపీఐ వృద్ధనేతకు అంతిమ వీడ్కోలు

మండపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏడిద గ్రామానికి చెందిన సీపీఐ తొలితరం నేత బండారు లక్ష్మణస్వామి(102) మంగళవారం ఆయన స్వగృహంలో వృద్ధాప్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు వున్నారు. భార్య, ఒక కుమారుడు మృతి చెందగా ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు వున్నారు. ఈయన పేదల హక్కుల కోసం పోరాడి మన్ననలు పొందారు. ఈయన అంత్యక్రియలు బుధవారం ఏడిద గ్రామంలో పార్టీ అభిమానులు, కుటుంబ సభ్యుల మధ్య నిర్వహించారు. తండ్రి పాడెని మోసి తమకున్న ప్రేమను కుటుంబ సభ్యులు చాటుకున్నారు. ఈయన మృతి పట్ల సీపీఐ నాయకుడు డాక్టర్ చెలికాని స్టాలిన్, జేవీవీ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ చల్లా రవికుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్, సీపీ రాష్ట్ర కార్యదర్శి తాటిపాక మధు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు సత్తిబాబు, సమత వ్యవ స్థాపకులు యేసుదాసు, గండిస్వామి ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గండి రవికుమార్ తదితరులు సంతాపం తెలిపిన వారిలో వున్నారు.



తండ్రి పాడె మోస్తున్న కుమార్తెలు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



కొత్తపేట గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎక్సైజ్ సీఐ కాత్యాయని

కొత్తపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచే విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయడం ద్వారా ఉన్నత స్థానాలకు పునాదులు వేసుకోవాలని ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని కోరారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంత రం సీఐ కాత్యాయనిని సత్కరించారు. దేశభక్తి జానపద గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.సునీత, చామకూర నాగేశ్వరరావు, కూచిమంచి సుధాకర్, వి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జొన్నాడలో కార్తీక వనసమారాధన

ఆలమూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం జొన్నాడలో వేమన రెడ్డి సంక్షేమ సంఘం అధ్వర్యంలో బుధవారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. కుటుంబ సభ్యులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా గడిపారు. మధ్యాహ్నం సామూహిక వనభోజనాలు ఆరగించారు. ముం దుగా యోగి వేమన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు తమలంపూడి రామకృష్ణారెడ్డి, జొన్నాడ మాజీ సర్పంచ్ ద్వారంపూడి దొరబాబు, కర్రి నాగిరెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

చింతలూరులో లక్షపత్రి పూజ

ఆలమూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చింతలూరు పార్వతీ సమేత పృధ్వీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా బుధవారం లక్షపత్రి, లక్షబిల్వార్చన నిర్వహించారు. చింతలూరు బ్రాహ్మణ సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పండితులు లక్షపత్రి, లక్షబిల్వార్చన జరిపించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

స్టాంపులు, నాణేల ప్రదర్శన

ఆత్రేయపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆత్రేయపురం గ్రంథాలయంలో అల్లు రామకృష్ణ పురాతన నాణేలు, కరెన్సీ నోట్లు, స్టాంపుల ప్రదర్శన నిర్వహించారు. దీన్ని సహకార సంఘం అధ్యక్షుడు ముదునూరి రామభద్రరాజు ప్రారంభించగా, విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి తంబా నమ్మశివాయ పాల్గొన్నారు. పేరవరం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను నిర్వహించగా, గ్రంథాలయాధికారిణి శ్రీదేవి నిర్మల పాల్గొన్నారు.

మాచవరంలో ఇందిరాగాంధీ జయంతి

రాయవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం గ్రంథాలయంలో 58వ గ్రంథాల వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం దివంగత ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి ప్రమీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి పాల్గొని విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. తొలుత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆలమూరు శివాలయంలో నెలరోజులపాటు శివపారాయణ చేసిన వారిని సత్కరిస్తున్న దృశ్యం

నెలరోజులపాటు శివపారాయణ చేసిన దంపతులకు సన్మానం

ఆలమూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోని విక్రమ భట్టేశ్వరస్వామి ఆలయంలో నెల రోజులపాటు మహిళా భక్తమండలి అధ్వర్యంలో సాగుతున్న శివపారాయణ ముగింపు సందర్భంగా అర్చకుల దంపతులను పలువురు సత్కరించారు. బుధవారం శివపారాయణ ముగింపు సందర్భంగా ఆలయ అర్చకులు కాళ్లకూరి సూరిపండు దంపతులకు నూతన వస్త్రాలు బహూకరించి సత్కరించారు. నెల రోజుల పాటు భక్తి గీతాలను ఆలపించిన మహిళ భక్తులను పలువురు అభినందించారు. సనాతన ధర్మం పట్ల ప్రతి ఒక్కరూ ఎంతో అంకిత భావంతో ఉంటూ ముందుకుసాగాలని వక్తలన్నారు.



రాయవరంలో కిశోర బాలికలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కిశోర బాలికలకు అవగాహన సదస్సు

రాయవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలికా సంక్షేమం, విద్య, వికాసం తదితర అంశాలపై బుధవారం రాయవరంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో యూ.పూర్ణిమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కీర్తి స్పందన, తహశీల్దారు బీవీ భాస్కర్ తదితరులు మాట్లాడుతూ తల్లిదండ్రులు లింగ వివక్షత వీడాలని, ఆడపిల్లల హక్కులపై అవగాహన కల్పించారు. కిశోర బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్య, వైద్యం, ఆరోగ్యం , పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఉండవిల్లి రాంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, విష్ణు, ఈశ్వరి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



కార్తీక వనసమారాధనలో పాల్గొన్న న్యాయాధికారులు

న్యాయవాదుల కార్తీక వనసమారాధన

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని టౌన్ హాలు వద్ద రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వుండవల్లి గోపాలరావు ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన జరిగింది. ముందుగా గోవర్ధనం మల్లేశ్వరరావు పూజలు నిర్వహించారు. ఈ వన సమారాధనకు సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, ఏజెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్ హాజరయ్యారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు వరహా నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడు జి.మల్లేశ్వరరావు, కోశాధికారి చింతపల్లి శ్రీనివాసరావు, క్రీడా కార్యదర్శి ఎస్.నారాయణరావు, జాయింట్ సెక్రటరీ శేషకుమార్, ఏజీపీ లకాని పద్మకమలకుమారి, న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.